
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 17.04.2015, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 46 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



• ఎన్‌కౌంటర్...

## ఉచ్చు బిగుస్తోంది!

### పోలీసులను బలిపశువులు చేస్తారా?

**ఎన్‌కౌంటర్... చట్టాలను తమ చుట్టాలుగా మార్చుకుని అందులోని లొసుగులను తమ రాచమార్గాలుగా మలచుకుని ఎన్ని ఖూనీలు చేసినా, ఎన్ని రేప్‌లు చేసినా దర్జాగా బయటకొచ్చి రోడ్ల మీద తిరిగే క్రిమినల్స్‌ను శిక్షించడానికి పోలీసులకు ఉన్న ఒకే ఒక ఆయుధం ఇది.**

భారతదేశంలో నేరం చేసిన వాడికి శిక్షపడే దానికంటే, వాడు తప్పించుకోవడానికే ఎక్కువ అవకాశాలుంటాయి. మన చట్టాలు, మన సమాజం కూడా అలాగే వుంటుంది. కోర్టుల్లో కేసులు ఏళ్ల తరబడి తెమలుతుంటాయి. ఈలోపు సాక్షులు మెత్తబడిపోతారు. మనకెందుకొచ్చిన తలనొప్పిలే అనుకుని నేరస్తులకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడం మానుకుంటారు. కేసు తుది విచారణ జరిగి తీర్పు వచ్చేనాటికి ముద్దాయికి వ్యతిరేకంగా ఎటువంటి సాక్ష్యాలు ఉండవు. చివరకు ఇలాంటి కేసులు నీరుగారిపోయి నేరస్తులు కాలరెగరేసుకుంటూ బయటకు వస్తుంటారు. ఇలాంటి క్రిమినల్స్‌ను కొంతవరకన్నా అదుపులో పెట్టడానికి, (మిగతా 10వ పేజీలో)



**మనిషిలో జ్వరాన్ని, షుగర్ లెవల్స్‌ను, కొలెస్ట్రాల్‌ను, బిపిని, విటమిన్-డిని, హిమోగ్లోబిన్‌ను... ఇలా అన్నింటిని కొలవడానికి మార్గాలున్నాయి. కాని మనిషిలోని అసంతృప్తిని కొలిచే సాధనాన్ని ఇంకా కనిపెట్టలేదు. ఒకవేళ అలాంటి సాధనాన్ని కనిపెట్టి జిల్లాలోని ఒక్కో తెలుగుదేశం నాయకుడు, కార్యకర్తలలోని అసంతృప్తిని కొలిస్తే, అసంతృప్తి ప్రతిఒక్కరిలో ప్రమాదకరస్థాయిలో ఉండడం ఖాయం. అంతగా నారాయణపై అసంతృప్తితో రగిలిపోతున్నారు నెల్లూరు తెలుగుతమ్ముళ్లు.**

• నారాయణ... నారాయణ

## భగ్గుమంటున్న తమ్ముళ్లు!

### మంత్రి ఇలాకాలో బ్రోకర్లదే రాజ్యం

**తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చినందుకు తెలుగు తమ్ముళ్లు మొదట్లో ఆనందించారు. ఇప్పుడు అధికారంలో లేకపోయినా బాగుండునని అనుకుంటున్నారు. అధికారంలో కంటే ప్రతి పక్షంలో వున్న పదేళ్లే హాయిగా ఉందని, ఎలాంటి ఆశలు లేకుండా బ్రతికామని, ఇప్పుడు ఆశలు నెరవేరక, ఆశలు చంపుకోలేక బ్రతకాల్సి వస్తుందని నీరసపడుతున్నారు.**

చంద్రబాబు మీద, మంత్రి నారాయణ మీద నెల్లూరు నాయకులంతా కూడా నిప్పులు కక్కుతున్నారు. జిల్లాలో ఒక్కో నాయకుడి ఆత్మవ్యధ ఒక్కో (మిగతా 10వ పేజీలో)



# చింతలదేవిని అభివృద్ధి చేస్తాం

## - రాష్ట్రమంత్రి ప్రత్తిపాటి



నెల్లూరు జిల్లా కొండాపురం మండలంలోని చింతలదేవి పశు గణాభివృద్ది క్షేత్రాన్ని అభివృద్ధి చేసి రాష్ట్రంలో అగ్రగామిగా నిలుపుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి ప్రత్తి పాటి పుల్లారావు తెలిపారు. ఈ నెల11న ఉదయగిరి మార్కెటింగ్ కమిటి ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి మాట్లాడుతూ చింతలదేవి ఫారంలోని 2500 ఎకరాల అభివృద్ధికి రూ. 25 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అయిదేళ్లలో విడతల వారీగా విడుదల చేస్తామన్నారు. ఎండుతున్న మామిడి, బత్తాయి తోటలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు సబ్సిడీ అందజేసేందుకు ముఖ్యమంత్రితో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, మార్కెటింగ్ కమిటీ ఛైర్మెన్ చంద్ర మధు సూదన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, పమిడి రవికుమార్ చౌదరి, సుంకర అంజనాద్రి, బొజ్జా నరశింహులు, జొన్నలగడ్డ రామానాయుడులు పాల్గొన్నారు.

# క్రిబ్‌కో అక్రమాలపై విచారణ చేయాలి

## జిల్లా కలెక్టర్‌కు కాకాణి వినతి

జిల్లాలో ఏర్పాటు చేయబోతున్న క్రిబ్‌కో ఎరువుల పరిశ్రమ భూములకు సంబంధించి చెల్లించాల్సిన నష్టపరిహారం విషయంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకిని కలిసి ఆ మేరకు వినతిపత్రం సమర్పించారు. వెంకటాచలం మండలంలో క్రిబ్‌కో ఎరువుల పరిశ్రమకు భూములు కేటాయించారని, పరిశ్రమకు భూములిచ్చిన రైతులకు ఎకరాకు రూ. 10 లక్షలు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారని, అయితే కొందరు బినామీ పేర్లు పెట్టి వారి భూములకు పట్టాలున్నట్లు సృష్టించుకుని పరిహారాన్ని స్వాహా చేశారని ఆయన కలెక్టర్‌కు వివరించారు. పరిహారం పక్కదారి పట్టడంతో, అర్హులైన రైతులు భూములు కోల్పోయి, నష్టపరిహారం అందక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. భూముల పరిహారం వ్యవహారంలో కోట్లాది రూపాయల అక్రమాలు జరిగాయని ఆయన అంటూ, ఈ విషయాలన్నిటిపై సమగ్రమైన విచారణ జరిపించాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. ఏసిబి ఆధ్వర్యంలో విచారణ జరిపించాలని, అక్రమాలకు పాల్పడి నష్టపరిహారాన్ని స్వాహా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నష్టపరిహారం స్వాహాచేసిన వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేయాలని ఆయన కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, జెన్‌కో ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం రైతుల భూములను స్వాధీనం చేసుకుందని, అయితే నష్టపరిహారం తక్కువగా నిర్ణయించారని ఆయన కలెక్టర్‌కు వివరిస్తూ, రైతుల భూములు కాకుండా సిజెఎస్‌ఎఫ్ భూములను జెన్‌కోకు సేకరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కాగా, ముత్తుకూరు చెరువులో కొందరు ప్రైవేట్‌వ్యక్తులు కలుజులు తొలగించడం వల్ల రైతులు చేతికి అందివచ్చిన పంటను నష్టపోయారని, ఆ రైతులకు తగు నష్టపరిహారం అందించేందుకు కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కాకాణి వెంట ముత్తుకూరు జడ్పీటిసి సభ్యులు వెంకటశేషయ్య, శివప్రసాద్ తదితరులున్నారు.

# సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పరికరాలు

సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.వేణుకృష్ణ అన్నారు. 11వ తేదీ నెల్లూరుజిల్లా ఉదయగిరి వ్యవసాయశాఖ కార్యాలయంలో రికార్డులను ఆయన పరిశీలించిన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ యాక్షన్ ప్లాన్‌ను త్వరగా తయారు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 28,824యూనిట్లు భూసార పరీక్షలు చేయాల్సి వుందన్నారు. జిల్లాలో 1,080మిల్లీమీటర్ల వర్షపాతానికి గాను 638.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, వర్షాభావ పరిస్థితుల వల్ల రబీసీజన్‌లో పంటల సాగు తగ్గిందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయాధికారులు సుబ్బారెడ్డి, జహీర్‌లు పాల్గొన్నారు.

# ఎస్ఐలకు స్థానచలనం

జిల్లాలో 12మంది ఎస్ఐల బదిలీలు జరిగాయి. విఆర్‌లో వున్న బి.సుబ్రహ్మణ్యంను పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు, కంట్రోల్‌రూంలో వున్న కె.శేఖర్‌బాబును నెల్లూరురూరల్‌కు, విఆర్‌లో వున్న కె.తిరుపతయ్యను నెల్లూరు రెండోనగరానికి, విఆర్‌లో వున్న ఎ.జగత్ సింగ్‌ను నెల్లూరు ఐదో నగరానికి, విఆర్‌లో వున్న జె.పి.శ్రీనివాసరెడ్డిని నెల్లూరు సౌత్ ట్రాఫిక్‌కు, విఆర్‌లో వున్న సి.హెచ్.కృపానందంను నెల్లూరు నాలుగోనగరానికి, నెల్లూరు రెండో నగరంలో వున్న కె.సాంబశివరావును ఓజిలికి, నెల్లూరు ఐదో నగరంలో వున్న వై.వి.సోమయ్యను మర్రిపాడుకు, రాపూరులో వున్న వి.విశ్వనాథ్‌రెడ్డిని కృష్ణపట్నం పోర్టుకు, కావలి ఒకటో పట్టణంలో వున్న కె.నాగార్జునను కలువాయికి, డిటిసిలో వున్న ఎన్.రామ్మూర్తిని కావలి ఒకటో పట్టణానికి, సోమశిలలో వున్న ఏ.సురేష్‌బాబును తడకు బదిలీ చేసారు.

# పొలాల్లో వడగండ్లు...

# అన్నదాతలకు కడగండ్లు



- ఆశలపై పడిన పిడుగులు
- అకాలవర్షంతో ఆవిరైన ఆనందం

*వానల కోసం నిన్న మొన్నటిదాకా ఎదురు చూసారు. ఆకాశం వంక తదే కంగా చూసారు. గత ఏడాది ఆగష్టు నుండి మొన్న జనవరి దాకా కూడా వానల కోసం ఎదురుచూడని వాళ్లు లేరు. ఒక దశలో తుఫాన్‌లు వచ్చినా మేలునుకు న్నారు. ఎందుకంటే తుఫాన్‌ల మూలంగా నన్నా వర్షాలు కురుస్తాయనే ఓ చిన్న ఆశ. కాని మొండి మేఘాలు కరుణిస్తేగా!*

ఈ యేడాది జిల్లాలో చాలినంత వర్షపాతం లేకుండా పోయింది. సోమ శిలలో నీళ్లు లేక పోవడంతో రెండో కారు పంటలు వేయొద్దని మంత్రి నారాయణ, కలెక్టర్ జానకిలు పిలుపునిచ్చారు. ఉన్న అరకొర నీటి వనరులతోనే వేలాది ఎకరా లలో రైతులు పైర్లు వేసారు. కష్టం మీద కోతల దాకా తీసుకొచ్చారు. కొన్ని ప్రాం తాల్లో కోతలు కూడా అయిపోయి ధాన్యం ఓదెలను కళ్లాల్లోనే ఉంచారు. అయితే ఆది, సోమవారాలలో వచ్చిన అకాలవర్షాలు అన్నదాతల పాలిట పెనుశాపంగా మారాయి. ఈదురుగాలులు, వడగళ్లవాన, పిడుగుల ధాటికి రైతుల బ్రతుకులు చెల్లా చెదురయ్యాయి. జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాలలో వరిపంటకు నష్టం వాటిల్లింది. వెంకటగిరి, ఉదయగిరి, ఆత్మకూరు, వింజమూరు, వెంకటాచలం, గూడూరు, విడవలూరు, మనుబోలు, కోట, వాకాడు. చిల్లకూరు ప్రాంతాల్లో వందలాది ఎకరాల పైరు వాలిపోయింది. కొన్నిచోట్ల కళ్లాల్లో పోసిన ధాన్య నీటమునిగి పాడైపోయింది. వరితో పాటు వేలాది ఎకరాలలో మామిడి, అరటి, బొప్పాయి తోటలు కూడా దెబ్బతిన్నాయి. అవసరం లేని కాలంలో వర్షం వచ్చి తమ కొంప ముంచిందని రైతులు లబోదిబోమంటున్నారు.

# మంటల్లో రైలుబండి

## అరుపులు, కేకలతో ప్రయాణికుల పరుగులు



నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట రైల్వే స్టేషన్లో సోమవారం రాత్రి 7.20గంటలకు చెన్నై నుంచి గూడూరుకు వెళ్తున్న ప్యాసింజర్ రైలులోని రెండవ బోగీలో ఒక్కసారిగా మంటలు రేగి దగ్ధమైంది. బోగీలో ప్రయాణీకులు లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. చెన్నై నుంచి గూడూరు వెళుతున్న ప్యాసింజర్ రైలు సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశి స్తుండగా ఒక్కసారిగా ఇంజన్ నుంచి రెండవ బోగీలో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో వెనుక బోగీలోని ప్రయాణీకులు చెయిన్ లాగటంతో రైలు నిలిచిపోయింది. అరుపులు, కేకలతో ప్రయాణీకులు పరుగులు తీసారు. వివరా ల్లోకి వెళితే... ఈ ప్యాసింజర్ రైలుకు చెన్నై పెరంబుదూరులోని కోచ్ ఫ్యాక్టరీలో మరమ్మత్తులు చేసిన రెండు బోగీలను తగి లించారు. వాటి పనితీరును పరిశీలిం చేందుకు ఈ రైలుకు వాటిని ఏర్పాటు చేశారు. సాధారణంగా మరమ్మత్తులు చేసిన బోగీలను ప్రయాణీకులు లేని గూడ్సుకు తగిలించి పంపించి పరిశీలిస్తుం టారు. రైల్వేశాఖ నిర్లక్ష్యంగా ప్రయాణీకులు వున్న ప్యాసింజర్ రైలుకు ఈ బోగీలను తగిలించడంతో వాటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ ఖాళీ బోగీలలోకి చెన్నైలో ప్రయాణీకులు ఎక్కడంతో రైలు బయలుదేరే సమయంలో రైల్వే పోలీసులు గమనించి వారిని దింపి పక్క బోగీలలోకి పంపించినట్లు సమాచారం. దీంతో మంట లతో బుగ్గి అయిన బోగీలో ప్రయాణీకుల అల్యూమినియం పాత్రలు మిగిలిపో యాయి. సమాచారం తెలుసుకున్న తహ శీల్దార్ మునిలక్ష్మి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అధికారులను ప్రమాద వివ రాలపై ఆరా తీశారు.

# రేషన్‌కార్డుల దరఖాస్తు

రేషన్‌కార్డులు పొందేందుకు అర్హులైన నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలని నెల్లూరు రూరల్ మండలం తహశీల్దార్ జనార్దన్‌రావు సూచించారు. గతంలో నెల్లూరు నగరం, రూరల్ మండలం నుంచి అందిన దరఖాస్తులను విఆర్‌ఓలు పరిశీలిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇంకా ఎవరైనా అర్హులైనవారు వుంటే తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

## రెవెన్యూ స్పోర్ట్స్‌లో

# జిల్లాకు పతకాలు

విశాఖపట్నంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి రెవెన్యూ స్పోర్ట్స్‌లో జిల్లాకు నాలుగు పతకాలు లభించాయి. కోట మండలం లోని విఆర్‌ఏ జి.వెంకయ్య వివిధ విభా గాల్లో ఎంతో ప్రతిభ చూపించి నాలుగు బంగారు పతకాలు సాధించి అందరి ప్రశంసలూ అందుకున్నారు. అదేవిధంగా, ఆత్మకూరు విఆర్‌ఏ సంధ్య లాంగ్‌జంప్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. బోగోలు తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న వెంకటేశ్వర్లు సిల్వర్ మెడల్ సాధించి స్పోర్ట్స్‌లో జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారు.

# హడలెత్తించిన ఆర్డీవో

నెల్లూరు ఆర్డీవో సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి మంగళవారం రాత్రి రాపూరులోని బజారువీధిలో హల్‌చల్ చేశారు. బజారువీధిలో తిరుగుతూ దుకాణాల ముందున్న చెత్తను స్వయంగా తొలగించారు. వీధికి కొనదాకా తిరిగారు. వీధిలోకి వచ్చిన బల్లలను, తోపుడుబండ్లను, రేకులను తొలగించారు. కిలోమీటరు దూరం వున్న బజారువీధిలో ఆయన నడుస్తూ అక్కడున్న చెత్తాచెదారం చూసి దుకాణాల యజమానులకు క్లాస్ పీకారు. బజారులో ఇంత చెత్త పేరుకుపోతే ఏం పీకుతున్నారంటూ పంచాయితీ సిబ్బందిపై కూడా మండిపడ్డారు. స్వచ్ఛభారత్ అంటూ ప్రభుత్వం నెత్తినోరు బాదుకుని చెబుతున్నా మీరు మారరా అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.


# భక్తి శ్రద్ధలతో సంగమేశ్వరుని రథోత్సవం



సంగంలో వెలసివున్న శ్రీ సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 12న స్వామివారికి కన్నుల పండువగా రథోత్సవాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఈ రథో త్సవంలో పాల్గొని స్వామివార్లను దర్శించుకు న్నారు. తొలుత, ఆలయ అర్చకులు రథోత్సవానికి సకల దేవతలను ఆహ్వానిస్తూ యాగం నిర్వహిం చారు. ఆ తర్వాత, భక్తుల జయజయధ్వానాల మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. హరహర మహాదేవ అంటూ భక్తులు పెద్దపెట్టున స్వామివారి నామజపం చేస్తుండగా, కామాక్షీతాయి సమేత సంగమేశ్వరస్వామి రథోత్సవం సంగం వీధుల్లో కనువిందుగా సాగింది. రథోత్సవం పొడవునా, వీధివీధిలోనూ పెద్దసంఖ్యలో భక్తులు భక్తిశ్రద్ధలతో కొబ్బరికాయలు, గుమ్మడికాయలు సమర్పిస్తూ, హారతులిస్తూ రథాన్ని స్వాగతించారు. ఈ రథోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంగం ఎస్ఐ విజయకుమార్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

# సేవే.. ఆయన శ్వాస

## - మీ పుట్టిన రోజూ.. పండుగే అందరికీ!



నూటికో..కోటికో ఒక్కరూ..ఎప్పుడో..ఎక్కడో పుడతారూ
అది మీరే మీరే మాస్టారూ.. మా దేవుడు మీరే మాస్టారూ!..

అని ప్రసిద్ధ సినీకవి వేటూరి అన్నట్లుగా, ఎందరో పుడుతూనే వుంటారు.. కానీ తమ పుట్టుకనే చరితార్థం చేసుకునేవారు నూటికో కోటికో ఒక్కరే వుంటారు. అలాంటి వారిలో ప్రముఖ పారిశ్రామికవేత్త, మంచితనం-దాన గుణం కలగలిసి జన్మించిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఒకరని వేరే చెప్పనక్కర లేదు. సేవాభావానికీ, మూర్తీభవించిన మానవత్వానికి ఆయనో ప్రతీక. దాతృత్వంలో సింహపురిసీమకు ఆయనో కీర్తి పతాక. సాటిలేని తన ఔదార్యంతో ఎంతో మంది జీవితాలకు ఆయన వెలుగురేకలను ప్రసరింప జేస్తున్నారు.

ఎందరో నిరుపేదలకు, అనాథలైన చిన్నారులకు, వికలాంగులైన మరెంతోమంది పసిబాలలకు ఆయనే దేవుడు. కష్టాల్లో వున్నవారిని అక్కున చేర్చుకుని వారికి అమృత సమానమైన తన ఆదరహస్తం అందిస్తూనే వున్నారాయన. సేవే.. ఆయనకు ఊపిరి.. ఆయన శ్వాస.. ధ్యాస అంతా సేవే. సమాజసేవే పరమార్థంగా భావించే సహృదయుడాయన. సమాజానికి నిరంతరం అపారమైన సేవలందిస్తున్న సేవా ప్రభాకరుడాయన. అందుకే ఆయన పుట్టిన రోజంటే.. ఆయనకూ, ఆయన కుటుంబసభ్యులకు మాత్రమే కాదు.. అది అందరికీ పండుగే.

వేమిరెడ్డి శివకోటారెడ్డి-శ్యామలమ్మ పుణ్యదంపతుల ఆఖరు సంతానంగా జన్మించినా, తల్లిదండ్రుల పేరు నిలపడంలో మాత్రం వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ప్రథమంగానే నిలిచారు. ఎందరో అనాథ పిల్లలను అక్కున చేర్చుకుని వారికి విద్యాబుద్ధులు నేర్పి, సమాజంలో వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దుతున్న మహా మానవీయమూర్తి ఆయన. ప్రతిభ వున్నా, చదువుకునేందుకు స్తోమతు లేక బాధపడుతున్న వందలాదిమంది చిన్నారులను అక్కున చేర్చుకుని వారి విద్యావికాసానికి అవసరమైన చేయూతనందిస్తోన్న విద్యాదాత ఆయన. నెల్లూరులోని వాత్సల్య సంస్థకు ఆయన సహకారం ఎనలేనిది. అనాథలు, నిరుపేదలు అయిన ఎంతోమంది చిన్నారులకు ఆసరాగా నిర్మితమైన వాత్సల్య సంస్థకు భవన నిర్మాణం కోసం అక్షరాలా పది లక్షల రూపాయలను విరాళంగా అందజేసిన మహాదాత వేమిరెడ్డి. ప్రతి ఏడాదీ మార్చి నెలలో వాత్సల్యలోని నిరుపేదలు, అనాథలైన ఆ చిన్నారులందరికీ భోజన ఖర్చును కూడా ఆయనే అందజేస్తున్నారు. అంతేకాదు, ఎంతోమంది మానసిక వికలాంగులను ఆదరిస్తున్న ప్రగతి ఛారిటీస్‌కు సాయంగా రూ.2లక్షల రూపాయల విరాళం అందించి ఆ వికలాంగుల సంక్షేమానికి ఆయన తనవంతు చేయూత నందించారు. ఇక్కడున్న వికలాంగులకు కూడా ఏడాదిలో ఒక నెల మొత్తం (మార్చి) భోజనం ఖర్చులను కూడా ఆయనే అందిస్తున్నారు. శారీరక, మానసిక వైకల్యాలతో సరిగా నడవలేక, నిలబడలేక దయనీయమైన స్థితిలో జీవితాలు గడుపుతున్న ఎంతోమంది వికలాంగులను ఆదుకునేందుకు నేనున్నానంటూ ముందుకువచ్చి.. వారి కన్నీటిని తుడిచి ఓదార్చే కరుణామూర్తి ఆయన. ఎంతోమంది పేదలకు, వికలాంగులకు ఆయనే ఆపద్బంధువు.. ఆత్మబంధువు కూడా. అన్నదాతగా ప్రసిద్ధిగాంచిన గ్రోసు గోపాలయ్య నెలకొల్పిన మాతా అన్నపూర్ణేశ్వరి వృద్ధాశ్రమంలోని అనాథ తల్లిదండ్రులకు కూడా ఆ దేవుడిచ్చిన బిడ్డ.. వేమిరెడ్డి గారే. ఆ ఆశ్రమానికి రూ.5 లక్షల విరాళం ఇవ్వడమే కాక, ఆ వృద్ధ తల్లిదండ్రులకు ఏడాదిలో ఒక నెల(ఆగస్టు)లో భోజనం ఖర్చులను పూర్తిగా ఆయనే భరిస్తున్నారు కూడా. ఇక ఆధ్యాత్మికరంగంలోనూ వేమిరెడ్డి సేవలు ఎనలేనివి. నెల్లూరులోని ఇస్కాన్ మందిరం అంటే ఆయనకెంతో ఇష్టం. ఆ మందిరం వారు నెల్లూరు పరిసర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు, పాఠశాలలకు మంచి రుచికరమైన, శుచికరమైన భోజనం అందిస్తున్నారు. వారు భోజనం తీసుకువెళ్ళేందుకు ఉపయోగపడేవిధంగా వేమిరెడ్డి రూ. 5 లక్షలు వెచ్చించి మంచి వాహనాన్ని కొనుగోలు చేసి, ఆ మందిరానికి విరాళంగా ఇచ్చారు. ఇలా చెప్పుకుంటూపోతే, మహాదాత అయిన వేమిరెడ్డి సేవాభిలాషతో అందిస్తున్న విరాళాలు, దానధర్మాలు, చేస్తున్న సేవా కార్యక్రమాలు, పుణ్యకార్యాలు అన్నీ ఒక పెద్ద గ్రంథమే అవుతాయి. చదువుకునేందుకు తగు ఆర్థికవసతులు లేక ఎంతో మధన పడుతున్న ఎంతోమంది చిన్నారులకు లక్షలాది రూపాయలు వెచ్చించి వారికి అవసరమైన విద్యాసామగ్రినంతా కిట్ల రూపంలో అందజేసిన ఘనత వేమిరెడ్డిదే. నెల్లూరు, కోవూరు, వెంకటాచలం మండలాల్లోని దాదాపు 4వందల మంది విద్యార్థులకు చెన్నైలోని రోటరీక్లబ్ సహకారంతో దాదాపు రూ.8లక్షలు వెచ్చించి, విద్యార్థులకు ఆ కిట్స్ పంపిణీ చేసిన విద్యాదాత ఆయన. వసతుల లేమితో బాధపడుతున్న నెల్లూరులోని కొండాయపాళెం గేటు వద్ద వున్న ప్రభుత్వ బి.సి బాలుర హాస్టల్‌లో రూ.6లక్షలతో ఆధునిక వసతులు కల్పించి ఆ పేద విద్యార్థుల కళ్లలో ఆనందం చూసి ఆయన ఉప్పొంగిపోయారు. ఆయన వితరణకు గుర్తుగా, రాష్ట్రంలోనే మరెక్కడా లేనివిధంగా ఆ హాస్టల్‌కు 'వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి బాలుర వసతి గృహం' అని నామకరణం చేశారంటే వేమిరెడ్డి దాతృత్వానికి.. సేవానిరతికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి?..

మంచితనం, మానవీయత.. మనసంతా ఆధ్యాత్మికత మూర్తీభవించిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి నిత్యం ఎన్నో దేవాలయాలకు, పుణ్య కార్యాలకు చేస్తున్న సేవ, అందిస్తున్న సహకారం అపారం. తన ఔదార్యంతో, కోట్లాది రూపాయలను సైతం వెచ్చిస్తూ, అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, సమాజసేవా కార్యక్రమాలకు కాదనకుండా.. లేదనకుండా తనవంతు ఆర్థిక చేయూతనందిస్తోన్న మహాదాత.. దాతలకే దాత అయిన.. నెరదాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి. ఇంతటి పుణ్యశీలి, దానశీలి.. సేవా ప్రభాకరుడు నెల్లూరీయుడు కావడం సింహపురి సీమకే గర్వకారణం. ఏప్రిల్ 19 ఆయన జన్మదినం సందర్భంగా వారికి శుభాకాంక్షలు.

## కూచిపూడి కళావైభవంకు ముమ్మర ఏర్పాట్లు

తెలుగు కళారంగానికి వెలుగు లాంటి కూచిపూడి నృత్య ప్రతిభను ప్రపంచానికి చాటే విధంగా ఈ నెల 18వ తేదీన ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో నెల్లూరు కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో "కూచిపూడి కళావైభవం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీని కోసం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరాదత్‌తో పాటు రాష్ట్ర విద్యాశాఖామంత్రి ఘంటా శ్రీనివాస రావు, జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకిలు కూడా ఈ వేడుకలకు హాజరుకానున్నారు. ఉదయం 9.30నుండి రాత్రి 7.30 వరకు కూచిపూడి కళావైభవాన్ని వివిధ కళారూపాల ద్వారా ప్రదర్శించేందుకు రాష్ట్రం నలుమూలల నుండి పెద్దఎత్తున కళాసంస్థలు, పేరొందిన కళాకారులు విచ్చేసారు. కూచిపూడి నృత్య వైభవాన్ని కనులారా తిలకించేందుకు నెల్లూరీయులు ఈ వేడుకకు హాజరు కావాలని, కూచిపూడి కళను తమ హర్షధ్వానాలతో ప్రోత్సహించాలని ఈ వేడుకల నిర్వాహకులు కోరుతున్నారు.



## కోటంరెడ్డి శీనయ్యకు
## మళ్లీ నగర కిరీటం

తెలుగుదేశంపార్టీ నెల్లూరునగర అధ్యక్షులుగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని వరుసగా రెండోసారి నియమించారు. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా 15వతేదీ నెల్లూరులోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో నగర అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక జరిగింది. సంస్థాగత ఎన్నికల పరిశీలకులు ఎస్.రంగారావు, ఎర్రాకుల శ్రీనివాసులు, పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, జిల్లా నాయకులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి వంటి వారి సమక్షంలో కోటంరెడ్డి శీనయ్యను మళ్ళీ అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. అలాగే మాజీకౌన్సిలర్ వై.వి.సుబ్బారావును ప్రధాన కార్యదర్శిగా నియమించారు. కోటంరెడ్డి శీనయ్యకు ఎక్కడున్నా చొక్కా చించుకోవడమో, లేదా అవతలి వాడి చొక్కా చించడమో జరిగేలా పనిచేస్తాడనే పేరుంది. కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంస్థ ఎన్ఎస్‌యూఐలో రాజకీయ అడుగులు వేసాడు. తర్వాత కాంగ్రెస్‌లో వీరసైనికుడిలా పనిచేసాడు. కాలం కలసిరాక, ఆనం బ్రదర్స్‌తో సరిపడక తెలుగుదేశంలో చేరాడు. తెలుగుదేశం ప్రతిపక్షంలో వున్న సమయంలో చొక్కా ప్యాంటులు చించుకునేలా పనిచేశాడు.




శుభాకాంక్షలు

ఆత్మీయతకు ప్రతిరూపంగా నిలిచి మానవత్వంతో మా మనసులకు చేరువైన మా అభిమాన నాయకుడు

శ్రీ పనబాక కృష్ణయ్య గారు

డా॥ బి.ఆర్.అంబేద్కర్ మరట్వాడ యూనివర్శిటీ నుండి "డాక్టరేట్" అందుకుని తేది. 18.04.2015, శనివారం ఉ॥ 10.00 గం॥లకు, గూడూరు, కోనేటిమిట్టలోని సి.ఆర్.మార్ట్ ఫంక్షన్‌హాల్‌లో ప్రజలు, అభిమానుల నుండి అభినందన సత్కారం అందుకుంటున్న శుభసందర్భంగా

మా హృదయపూర్వక శుభాకాంక్షలు.



మీ...
మనుబోలు హరిప్రసాద్‌రెడ్డి
గూడూరు.

MK GROUP
Since 1970

కృతజ్ఞతాంజలి

మా కస్టమర్ దేవుళ్ళ అభిమానమే అండగా
43 సం॥లుగా "రుచి" "శుచి"లలో రాజీలేని "మీ"

మురళీకృష్ణ నేతి మిఠాయిలు

మద్రాసు బస్టాండు దగ్గర, నెల్లూరు. ఫోన్: 2336616

అత్యంత అందంగా... అధునాతనంగా... విశాలంగా ముస్తాబైన
మురళీకృష్ణ నేతి మిఠాయిలు
ప్రారంభోత్సవానికి విచ్చేసి ఆశీర్వదించిన
ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక
కృతజ్ఞతాంజలులు.



మీ.... గ్రోసు గోపాలయ్య



# 'ప్రభా'తం

ఉగ్రవాదం.. ప్రపంచవ్యాప్తంగా ముంచుకొస్తున్న ఒక పెను ముప్పు. ప్రపంచ మానవాళి మనుగడకే ప్రమాదకరంగా పరిణమిస్తున్న ఉగ్రవాద మహమ్మారిని ప్రతిఒక్కరూ తీవ్రంగా వ్యతిరేకించాలి. ప్రత్యేకించి ప్రపంచ దేశాలన్నీ ఉగ్రవాదంపై కలసికట్టుగా ఉమ్మడిపోరు సాగించాలి..అంటూ భారత ప్రధాని ఏ దేశానికి వెళ్ళినా పదే పదే హెచ్చరిస్తూనే వున్నారు. ఉగ్రవాదం ఎంతటి ప్రమాదకరమైనదో విశదీకరిస్తూ, మానవత్వం వున్న ప్రతిఒక్కరూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరు సాగించాలని పిలుపునిస్తుండడం విశేషం. దీంతో, ఆయన పర్యటనలకు ఎనలేని స్పందన వస్తోంది. ఉగ్రవాదంపై ఉమ్మడిపోరు సాగించాలంటూ బెర్లిన్‌లో ఆయన ధీరగంభీరంగా చేసిన ప్రసంగం ప్రపంచ ప్రజలను సైతం ఎంతగానో ఆకట్టుకుంది.

ఉగ్రవాదం అనేది మానవాళి ఎదుర్కొంటున్న అతి పెద్ద ప్రమాదమనీ, మానవత్వంపై నమ్మకం వున్న ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఉగ్రవాదాన్ని వ్యతిరేకించాలని ఆయన కోరారు. అంతేకాదు, ఉగ్రవాదులకు ఆయుధాలు అందిస్తున్నవారిని ఎలా కట్టడి చేయాలో, ఉగ్రవాదులకు ప్రభుత్వాలే ఆశ్రయం కల్పిస్తున్న దేశాలపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావాలో అందరం కలసి ఆలోచించాల్సి వుందని ప్రధాని ఈ సందర్భంగా సూచించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పాక్ అనుసరిస్తున్న ఉగ్రవాద అనుకూల వైఖరిని అన్యాపదేశంగా ప్రస్తావిస్తూ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసి వుంటారేమోనని అందరూ భావిస్తున్నారు కూడా. ఏదేమైనా, ప్రపంచ మానవాళి మనుగడకే ముప్పు గా పరిణమిస్తున్న ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదన్నదే ప్రధాని అభిమతం. ఉగ్రవాదులనే కాదు, ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్న దేశాలపై కూడా అంతర్జాతీయ సమాజమంతా కలసికట్టుగా ఒత్తిడి తీసుకురావాలన్నదే ఆయన లక్ష్యం. అణ్వాయుధ వ్యాప్తి ఎంత ప్రమాదకరమో, ఉగ్రవాదమూ అంతే ప్రమాదకరం కనుక, ఉగ్రవాదంపై కఠినంగా వ్యవహరించాలన్నదే ఆయన ధ్యేయం. అందుకే ఆయన ఉగ్రవాదంపై పోరుకు పిలుపు ఇచ్చినప్పుడల్లా ప్రపంచవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది. ప్రధాని తన పర్యటనలో భాగంగా జర్మనీలోని బెర్లిన్‌లో పర్యటించి, జర్మనీ చాన్స్‌లర్ ఎంజెలా మెర్కెల్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. భారత్ ఆకాంక్షలను వివరించారు. ఈ సందర్భంగా, ఉగ్రవాదంపై ఉమ్మడిపోరుకు భారత్-జర్మనీ అంగీకరించాయని జర్మనీ చాన్స్‌లర్ ఎంజెలా మెర్కెల్ ప్రకటించడం సంతోషదాయకం. ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో ప్రధాని తన పర్యటన పూర్తిచేసుకుని, ఇక కెనడాలోనూ పర్యటించనున్నారు. ప్రధాని ఏ దేశానికి వెళ్ళినా తన పర్యటనలో ముఖ్యంగా రెండు ప్రధాన విషయాలను ప్రస్తావిస్తుండడం విశేషం. వాటిలో ఒకటి.. భారత్‌లో అభివృద్ధికి బాటలు వేస్తూ భారత్‌ను మేకిన్ ఇండియాగా రూపొందించేందుకు చేస్తున్న కృషిని వివరించడం, రెండవది..ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని ప్రపంచ ప్రజలందరికీ పిలుపునివ్వడం. ఈ రెండు అంశాలూ, ఒకటి దేశ ప్రగతి దృష్ట్యా, రెండవది ప్రపంచ భవిత రీత్యా ఎంతో అవసరమూ, అత్యవసరమైనవే. అందులోనూ, ప్రతి మాటా సరళంగా.. స్పష్టంగా.. అందరికీ అర్ధమయ్యే రీతిలో ప్రధాని చేస్తున్న అర్ధవంతమైన ప్రసంగాలు అన్ని దేశాల ప్రజలనూ ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. ఏ దేశమేగినా, ఎందుకాలిడినా.. పొగడరా నీ తల్లి భూమి భారతిని.. అన్నట్లుగా, ఎంతో చిత్తశుద్ధితో, దేశభక్తితో ప్రధాని చేస్తున్న ప్రసంగాలు, చేపట్టిన కార్యక్రమాలు ప్రపంచ దృష్టిని బాగా ఆకర్షిస్తున్నాయి. 'మేకిన్ ఇండియా' ధ్యేయంతో ఆయన ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టడంలో ఎంతగానో సఫలీకృ తమవుతున్నారు కూడా.

ఫ్రాన్స్, జర్మనీ పర్యటనల్లో ప్రధాని మాట్లాడుతూ, భారతదేశాన్ని అభివృద్ధిలో అత్యున్నత శిఖరాలు అధిరోహింపజేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేయడమే కాక, భారత్‌ను ప్రపంచ తయారీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంతేకాదు, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం భారత్ హక్కు అని ప్రధాని గంభీరస్వరంతో స్పష్టం చేయడం దేశప్రజలకు ఆనందం కలిగించింది. ఐరాస భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం కోసం గత ఏడు దశాబ్దాలుగా భారత్ నిరీక్షిస్తోందనే విషయాన్ని ప్రధాని ప్రస్తావిస్తూ, ఇకనైనా ఈ విషయంపై ఐరాస ప్రత్యేక దృష్టి సారించాలని, ఇకపై ఇందుకోసం భారత్ వేడుకోబోదని స్పష్టం చేయడం విశేషం. ప్రపంచ శాంతి కోసం భారత్ ఎన్నో త్యాగాలు చేసిందని, మొదటి ప్రపంచయుద్ధంలో లక్షలాదిమంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారనీ, అసలు భారత్ అంటేనే త్యాగాలకు ప్రతిరూపమని చెప్పడం దేశ ఔన్నత్యాన్ని మరింతగా ఇనుమడించినట్లయింది. ఈ సందర్భంగా జర్మనీలోని హనోవర్‌లో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని ప్రధాని మోడీ ఆవిష్కరించడం ఆయన పర్యటనలో మరో విశిష్టమైన అంశంగా నిలిచింది. ఇకపోతే, పర్యావరణ పరిరక్షణ విషయంలో భారత్‌ను విమర్శిస్తున్న దేశాలకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా తనదైన శైలిలో స్పందించారు. పర్యావరణాన్ని నాశనం చేసేవారికి తాము సమాధానం చెప్పాల్సిన అవసరం లేదనీ, ప్రకృతికి సేవ చేసిన వారెవరైనా వున్నారంటే, అది భారతీయులేనని సగర్వంగా ప్రకటించి అందరి హర్షధ్వానాలనూ అందుకున్నారాయన. భారతీయులు నదులను తల్లులుగా, వృక్షాలను దైవాలుగా పూజిస్తారని నొక్కి చెప్పారు కూడా. ఇతర దేశాల్లో ఇంత నిర్మొగమాటంగా మాట్లాడడం చిన్నవిషయమేమీ కాదు. అయినా, ప్రధాని ఎంతో నిర్భీతిగా, సూటిగా తాను చెప్పదలచుకున్నది చెప్పడం ఆయన నైజం. ఆ తత్వమే..ఆ మంచి వ్యక్తిత్వమే ఆయనకు ప్రపంచవ్యాప్తంగా మంచిపేరు తెస్తోంది.

అయితే, ఇక్కడొక మాట. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇలాంటి విదేశీ పర్యటనల్లో గత ప్రభుత్వ అవినీతిని ప్రస్తావించి ప్రధాని విమర్శలు చేయడం రాజకీయవర్గాల్లో కలకలం సృష్టిస్తోంది. స్వదేశానికి సంబంధించి విదేశాల్లో ఇలాంటి విమర్శలు సముచితమా?.. ప్రధాని స్థాయికి ఇది సమంజసమా?.. అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయవర్గాల్లో తాజాగా ఈ అంశం బాగా చర్చనీయాంశమైంది. ఏదేమైనా, అలాంటి విమర్శలకు తావు లేకుండా, ఇలాంటి అంశాలపై జాగరూకత వహించాల్సి వుంది!..

## ఏకతాటిపైకి ప్రపంచం



ఉగ్రవాదం... ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రమాదం. అందుకే, అందరూ ఉగ్రవాదాన్ని వ్యతిరేకించాలని ప్రధాని మోడీ ప్రపంచ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన ఫ్రాన్స్, జర్మనీల్లో పర్యటించారు. ప్రధాని ఏ దేశానికి వెళ్ళినా ప్రధానంగా మేకిన్ ఇండియా లక్ష్యాన్ని వివరించడానికి, ప్రపంచ మానవాళికి పెనుముప్పుగా పరిణమిస్తున్న ఉగ్రవాదంపై ఉమ్మడిపోరుకు ప్రపంచ దేశాలను సమాయత్తం చేయడానికి ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ రెండూ అత్యవసరమైనవే కనుక, ప్రధాని కృషి అందరి ప్రశంసలూ అందుకుంటోంది.

# అంబేద్కర్ స్ఫూర్తితో ముందడుగు



విద్యార్థినులతో కేక్ కట్ చేయిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.జానకి

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు వెళ్దామని నెల్లూరుజిల్లా కలెక్టర్ ఎం.జానకి అన్నారు. ఈనెల 14న నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రంలో అంబేద్కర్ 125వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దళితులు బాగా చదువుకుంటే సమాజంలో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాల్సిన అవసరముందన్నారు. జిల్లాకు చెందిన మల్లి మస్తాన్‌బాబు మారుమూల గ్రామంలో పుట్టినా ప్రపంచంలోనే గొప్ప పర్వతారోహకుడిగా పేరు సంపాదించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, కురుగొండ్ల రామకృష్ణ, ఏజేసి సాల్మన్ రాజ్‌కుమార్, ఏఎస్పీ రెడ్డి గంగాధర్, సోషల్ వెల్ఫేర్ డిడి ప్రసాదరావు, ఐటిడిఏ పిఓ వెంకటేశ్వర్లు, డిఆర్‌ఓ సుదర్శన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

***టిడిపి కార్యాలయంలో...*** టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బద్దేపూడి రవీంద్ర ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతిని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు రమేష్‌రెడ్డి, బల్లి దుర్గాప్రసాద్‌రావు, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

***వైయస్సార్ టిఎఫ్ ఆధ్వర్యంలో...*** నెల్లూరు వైయస్సార్‌సిపి సిటీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి వైయస్సార్ టిఎఫ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాలిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.వాసు, ప్రకాశంజిల్లా నాయకులు రఘురామిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

***బీజేపీ కార్యాలయంలో...*** భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

***బార్ అసోసియేషన్‌లో...*** జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్జీలు, న్యాయవాదులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అదనపు జిల్లా జడ్జీలు జగదీష్‌చంద్రరావు, పాపిరెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, ఆనంద్, మధుసూదన్‌రావు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.రజని కేక్ కట్ చేసి పంచిపెట్టారు. బార్ అధ్యక్షుడు ఎం.రామచంద్రారెడ్డి, ప్రధానకార్యదర్శి జి.బాలసుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.

***విఎస్‌యూలో...*** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి వర్సిటి విసి ఆచార్య వి.వీరయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ ఆచార్య కె.మురగయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.




## మైక్‌సౌండ్ తగ్గించాలి

నెల్లూరు పట్టణంలో కోర్టు పక్కన మసీదు ఉండడం వల్ల సౌండ్ విపరీతంగా పెట్టినప్పుడు కోర్టు మేజిస్ట్రేట్, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. చాలాచోట్ల ఇళ్ల మధ్య ప్రార్థనామందిరాలుండడం, వాటిల్లో నుండి వచ్చే మైక్‌సౌండ్‌ల వల్ల పరీక్షల టైంలో పిల్లలు చదువుకోలేకపోతున్నారు. ప్రార్థనామందిరాలలో సౌండ్‌ను నియంత్రిస్తూ ప్రభుత్వం జిఓ తేవాలి. లేకుంటే రోజులో పలుసార్లు ఈ మైకుల వల్ల ఇబ్బంది పడాల్సి వస్తుంది. **– వై.హనుమాన్, అడ్వకేట్, నెల్లూరు.**

## అన్నదానం నిర్వహించాలి

నెల్లూరు పట్టణం చాలా ప్రాచీనమైంది. క్రీ॥శ॥ 8వ శతాబ్దం నుండే నెల్లూరు పెద్ద పట్టణంగా ఉన్నట్లు తెలుస్తుంది. క్రీస్తుశకం 10, 11వ శతాబ్ధాలకే గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయం ఉండేదని పురావస్తు శాఖ వాళ్లు భావిస్తున్నారు. ఇరుకళల పరమేశ్వరి ఆలయం అభివృద్ధికి దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు ప్రత్యేక దృష్టిపెట్టాలి. నెల్లూరు ఎంపి, ఎమ్మెల్యేలు, జడ్పీ ఛైర్మెన్ కూడా తమవంతు సహకారం అందించాలి. పారిశ్రామికవేత్తలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆల్తూరు ఆదినారాయణరెడ్డి లాంటివారు దేవాలయంలో ప్రతి శుక్ర, మంగళవారాలలో అన్నదానం నిర్వహించేందుకు ముందుకు రావాలి. ***– బి.మహేంద్ర, నెల్లూరు.***

## అంకమ్మ భూములు ఆక్రమించారు

విడవలూరు గ్రామదేవత అంకమ్మతల్లి దేవస్థానం దగ్గర భూములను ఆక్రమించుకొని కొందరు రూంలు నిర్మించారు. దేవస్థానం వెనుక పక్కన కొందరు వారిని అడ్డగించారు. గతంలో అంకమ్మ దేవస్థానం చుట్టూ ప్రహరీగోడ నిర్మిస్తే స్వార్ధపరులు రాజకీయ లబ్ది కోసం దానిని తొలగించారు. ఇక్కడ కట్టిన రూములను వెంటనే తొలగించాలి. జిల్లా కలెక్టర్, కోవూరు ఎమ్మెల్యే ఈ సమస్యను పట్టించుకుని పరిష్కరించాలి. ***– పి.అమర్‌నాథ్, నెల్లూరు.***

## విద్యార్థులు... ఆదర్శాలు

ప్రస్తుతం దర్యాప్తులోవున్న బత్తిబాబు హత్యకేసు, గతంలో సంచలనం కలిగించిన ఆయేషా కేసు,లక్ష్మీ –మనోహర్‌ల కేసులు తీవ్ర ఆవేదనను కలిగించుచున్నవి. సమాజానికి ఎన్నో సేవలు చేయవలసిన విద్యార్థులు చెడు అలవాట్ల వలన, చరవాణి దుర్వినియోగము వలన పౌరసమాజానికి కళంకము కలిగించుచున్నారు. కనుక తల్లిదండ్రులు తమ సంతానము యొక్క ప్రవర్తనను గమనించి ఆదర్శవంతమైన పౌరులుగా రూపొందుటకు కృషి చేయాలి. భగవంతుడు బత్తిబాబు ఆత్మకు శాంతి కలుగజేయాలి. **– పెండాల రాజశేఖర్, నెల్లూరు.**

# మాట వినకుంటే... మారిపోతారంతే!



- నిన్న సెంథిల్‌కుమార్... నేడు చక్రధర్
- తెలుగునేతల ఒత్తిళ్లతో సిన్సియర్ అధికారులకు స్థాన చలనం

అభివృద్ధి, అవినీతి, ప్రజాసంక్షేమం వంటి విషయాలను పక్కనపెడితే ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు ఒక బ్రాండ్ ఇమేజ్ ఉంది. ఆయన అడ్మినిస్ట్రేషన్ బాగుంటుందని, సమర్థవంతులైన అధికారులను ఉపయోగించుకుంటారని, అలాంటి వారిని బదిలీ చేయమని సొంత పార్టీ నాయకులే ఒత్తిళ్లు తెచ్చినా లెక్కచేయరనే పేరుండేది. 1995-2004ల మధ్యలో చంద్రబాబు సీఎంగా పని చేసి నప్పుడు ఈ ఇమేజ్ వచ్చింది. అప్పుడు మంచి ఆఫీసర్లను ఆయన నియమించే వాడు. 1999 ప్రాంతంలో నెల్లూరుజిల్లా ఎస్పీగా సమర్థవంతంగా పనిచేసిన కొత్తకోట శ్రీనివాసరెడ్డిని బదిలీ చేయాలని అప్పుడు జిల్లా తెలుగుదేశం ఎమ్మెల్యేలు తీవ్రంగా ప్రయత్నించినా చంద్రబాబు వినుకోలేదు.

చంద్రబాబు ఇప్పుడు మళ్లీ సీఎం అయ్యాక అడ్మినిస్ట్రేషన్ అలాగే వుంటుందని, అధికారులపై అధికారపార్టీ నాయకుల పెత్తనం ఉండదని అందరూ భావించారు. కాని అదంతా వట్టిదేనని తేలిపోయింది. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కంటే ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వంలోనే రాజకీయ ఒత్తిళ్లు బలంగా పనిచేస్తున్నా యనేదానికి జిల్లాలో జరిగిన ఇద్దరు ఉన్నతాధికారుల బదిలీలే ఉదాహరణ.

ఈమధ్యనే జిల్లా ఎస్పీగా పనిచేసిన ఎస్.సెంథిల్‌కుమార్‌ను బదిలీ చేసారు. ఇది పక్కా రాజకీయ బదిలీ. ఎందుకంటే అతని మీద ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవు. పోలీస్ శాఖలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు కూడా లేవు. గట్టిగా పనిచేశాడు. పోలీసులకు కూడా ఊపిరాడనివ్వకుండా పని పెట్టాడు. 8 నెలలకే బదిలీ చేయాల్సినంత తప్పుయితే ఆయనేమీ చేయలేదు. కాని జిల్లాలో అధికారపార్టీ ఎమ్మెల్యేలకు ఆయన వ్యవహారం మింగుడు పడలేదు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అయితే బహిరంగంగానే త్వరలోనే ఎస్పీ బదిలీ అవుతాడని ప్రకటించారు. అన్నట్లే ఆయన 8నెలలకే బదిలీ అయ్యారు.

తాజాగా ఇప్పుడు నెల్లూరు నగరపాలక కమిషనర్ చక్రధర్‌బాబు బదిలీ కూడా అధికారపార్టీ నేతల ఒత్తిళ్లతో జరిగిందే! ఈయన కమిషనర్‌గా వచ్చి 6నెలలు దాటిందంతే! మొదట కడపలో వున్న ఓబులేసును నెల్లూరు కమిషనర్‌గా వేయాలనుకున్నారు. దీనికి ఫార్మాలిటీస్ కూడా పూర్తయ్యాయి. అయితే ఐఏఎస్ అధికారిని కమిషనర్‌గా వేస్తేనే నెల్లూరు కార్పొరేషన్ గాడిలో పెట్టగలమని, నెల్లూరు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లగలమని భావించిన కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ఆ దిశగా నారాయణపై ఒత్తిడి తెచ్చారు. ఐపిఎస్ కమ్ ఐఎఎస్ అయిన చంద్రధర్‌బాబును నెల్లూరు నగర కమిషనర్‌గా వేయించారు. ఈయన ముక్కుసూటి మనిషి, వచ్చినప్పటి నుండి కూడా మేయర్‌ను, కార్పొరేటర్లను ఎవరినీ లెక్కపెట్టలేదు. నగర కార్పొరేషన్ పరిధిలో ఎన్నో సొంత నిర్ణయాలు తీసుకున్నాడు. ముఖ్యంగా అవినీతి, అక్రమాలను కంట్రోల్ చేసారు. సిబ్బంది చేత ఒళ్లు వంచి పనిచేయించారు. ముఖ్యంగా నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, పందులను తరలించడం వంటి వాటిపై దృష్టిపెట్టారు. అయితే స్టాండింగ్ కమిటి ఎన్నికలతో పాటు మరికొన్ని విషయాలలో మేయర్‌కు కమిషనర్‌కు పడకుండా వచ్చింది. అట్లాగే కొంతమంది కార్పొరేటర్లు కూడా ఆయనతో గొడవపడ్డారు. ఈ నేపథ్యంలోనే కమిషనర్‌ను మార్చాలనే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. మేయర్ ఎలాగూ మున్సిపల్ మంత్రి నారాయణ అనుచరుడే... రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా అన్నట్లు... మంత్రి తలచుకుంటే కమిషనర్ బదిలీ జరక్కుండా పోతుందా? ఆ విధంగా చక్రధర్‌బాబు రాజకీయ బదిలీ జరిగి రంపవరం ఐటిడిఏ ప్రాజెక్ట్‌లో పడ్డాడు. మంత్రా... మజాకా!

కాని ఒకే సమయంలో ఇద్దరు ఉన్నతాధికారుల రాజకీయ బదిలీలు మాత్రం జిల్లాలో సంచలనం కలిగించాయి. ప్రతిపక్ష వైకాపా ఎమ్మెల్యేలకు ప్రభుత్వాన్ని తిట్టిపోయడానికి ఇదొక సాకు దొరికింది. ఈ బదిలీలతో అధికారులకు కూడా చంద్రబాబు అడ్మినిస్ట్రేషన్ మీద నమ్మకం పోతుంది.

## తదుపరి కమిషనర్ ఎవరు?

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ చక్రధర్‌బాబు బదిలీ నేపథ్యంలో తర్వాత కమిషనర్ ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. అదనపు కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డికి ఇన్‌ఛార్జ్ కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. చక్రధర్‌బాబు తర్వాత అయినా కార్పొరేషన్‌కు ఐఏఎస్ అధికారినే కమిషనర్‌గా వేయాలి. నెల్లూరు కమిషనర్‌గా వచ్చేందుకు ఐఏఎస్‌లు పెద్దగా ఆసక్తి చూపరు. చక్రధర్‌బాబు బదిలీ చూసిన తర్వాత అసలు ఎవరు కూడా ఇక్కడకు రావాలనుకోరు. కాకపోతే ఒకరి పేరు మాత్రం వినిపిస్తుంది. విశాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న యువరాజ్‌ను నెల్లూరు కమిషనర్‌గా బదిలీ చేసే అవకాశాలున్నాయి. నెల్లూరు కలెక్టర్ ఎం.జానకి భర్తే యువరాజు. ఇద్దరూ ఒకే చోట ఉండేందుకు వీలుగా యువరాజ్‌ను ఇక్కడకు బదిలీ చేసే వీలుంది.

# ప్రీమియంలపై.. పైసలేరుకుంటున్నారు

## ఇన్సూరెన్స్ సంస్థలో అవినీతి న్యూసెన్స్

*ఇన్సూరెన్స్... మనిషికైనా చెట్టుకైనా, బండికైనా... భద్రత కల్పించే మార్గం. ప్రతి మనిషి జీవితంలోనూ ఇన్సూరెన్స్ అనేది ఎక్కడో ఒక చోట భాగమైపోయింది. ఆరోగ్యానికి ఇన్సూరెన్స్, భవిష్యత్‌కు ఇన్సూరెన్స్ అవసరాలుగా మారిపోయాయి. ఈ ఇన్సూరెన్స్ సంస్థలకు పిల్లర్స్ ఏజంట్లు. వాళ్లు శ్రమిస్తేనే సంస్థలు వృద్ధి చెందుతాయి. వ్యాపారం వర్ధిల్లుతుంది. కాని నెల్లూరులోని ఓ ఇన్సూరెన్స్ కంపెనీలో సంస్థ ఏజంట్లకు వీసమెత్తు విలువ కూడా ఇవ్వకుండా కొందరు అధికారులు తమ ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్న తీరు బాధాకరంగా వుంది.*

నెల్లూరులో యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ 40ఏళ్లుగా వ్యాపారం చేస్తూ ఖాతాదారులకు అత్యుత్తమ సేవలందిస్తుంది. ప్రధానంగా ఇది వాహనాల ఇన్సూరెన్స్ సంస్థ. ఎన్నో ఇన్సూరెన్స్ కంపెనీలు పోటీగా వచ్చినప్పటికీ వ్యాపారంలో యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ అగ్రభాగంలో వుండటానికి ప్రధాన కారణం ఏజంట్ల కృషే! ఈ సంస్థకు నెల్లూరులో డివిజన్ కార్యాలయంతో పాటు జిల్లా మొత్తంమ్మీద ఏడు శాఖలున్నాయి. అయితే ఇటీవల సంస్థలో చేరిన ముగ్గురు అధికారులు తమ అవినీతి నిర్వాకంతో సంస్థను భ్రష్టు పట్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సంస్థ నుండి సస్పెండ్ చేయబడ్డ ఇద్దరు ఉద్యోగులతో కలిసి ఈ ముగ్గురూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఏజంట్లు ఎండనకా, వాననకా ఖాతాదారులను బ్రతిమాలాడి పాలసీలు తెచ్చుకుని ప్రీమియంలు కడుతుంటే ఏజంట్లను వాటి మీద కమిషన్‌లే కాకుండా ఇన్సెంటివ్‌లలో వాటా కూడా అడుగుతూ వారిని నానా ఇబ్బందులు పెడుతున్నాడు ఓ అధికారి. మహిళా ఉద్యోగినులకు సైతం ఇక్కడ పనిచేయడం కష్టంగానే వున్నట్లు తెలుస్తుంది. ఈ అధికారి ఇక్కడ చేరకముందు మరో సంస్థలో పనిచేస్తూ అక్కడ నుండి బహిష్కరించబడ్డట్లుగా సమాచారం. ఏజంట్లకు ఇవ్వాల్సిన ఇన్సెంటివ్‌లను సకాలంలో ఇవ్వకుండా సతాయిస్తున్నారు. మరో అధికారి సంస్థ కార్యాలయాన్ని మత ప్రచారానికి వాడుకుంటూ, సొంతూరులో ప్రార్థనా మందిరాన్ని నిర్వహిస్తూ విదేశాల నుండి నిధులను పొందుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఇంకో అధికారిది కూడా ఇదే తీరు. ఏజంట్లను పురుగులకన్నా హీనంగా చూస్తూ వారికొచ్చే ఇన్సెంటివ్‌ల మీద వాటా ఇవ్వకపోతే ఉద్యోగాలుండవని బెదిరిస్తూ తన పబ్బం గడుపుకుంటున్నాడు. పాలసీదారుల వాహనాలు ప్రమాదాలకు గురైనప్పుడు క్లెయిమ్‌కు దరఖాస్తు చేస్తే, నష్టపరిహారంలో కూడా వాటాలు నొక్కేస్తూ యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ సంస్థపైనే ఖాతాదారులు విరక్తి పెంచుకునేలా చేస్తున్నారని తెలుస్తోంది. ఈ అవకతవకలపై విచారణ జరిపించి, ఈ అధికారుల ఆగడాలను అరికట్టకపోతే సంస్థకే నష్టమని ఏజంట్లు, ఖాతాదారులు వాపోతున్నారు.





# తోలు పెరికితే... టోల్ పీకేసారు!

***మూర్ఖంగా పనిచేసేవాళ్లు మెడలు వంచాలంటే ఉద్యమాలు తప్పేటట్టు లేవు. ప్రభుత్వాలు మంచిపనులకు చివర, ముద నష్టపు పనులకు ముందర ఉంటుంటాయి. ఇలాంటి పనికిమాలిన పనే నెల్లూరు వద్ద గల జాతీయ రహదారిపై చేయబోయారు. విపక్షాలన్నీ ఏకమై కన్నెర్రజేసే సరికి తోకముడిచారు.***

ఇప్పటికే జాతీయ రహదారిపై టోల్‌గేట్ల బాదుడు ఎక్కువగా వుంది. నెల్లూరు నుండి చెన్నైకి పోవాలంటే ఆయిల్‌కు ఎంత ఖర్చవుతుందో, ఈ టోల్‌గేట్ల ఫీజులకు కూడా అంతే అవుతుంది. ఉన్న టోల్‌గేట్ల బాదుడు చాలదన్నట్లు తాజాగా నెల్లూరు శివార్లలో కనుపర్తిపాడు వద్ద మరో టోల్‌గేటు పెట్టాలనుకున్నారు. ఈమేరకు ఏర్పాటు కూడా చేసారు. అయితే నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వామపక్షాలు, లారీఓనర్స్ అసోసియేషన్ వాళ్లు దీని మీద గట్టిగా పోరాడడంతో తాత్కాలికంగా టోల్‌గేటు నిర్మాణాన్ని నిలిపి వేశారు. అయితే తిరిగి అక్కడే టోల్‌గేట్ ఏర్పాటు చేయాలంటూ ప్రభుత్వం నుండి ఆదేశాలొచ్చాయి. దీంతో కాంట్రాక్టర్ మళ్లీ టోల్‌గేటు నిర్మాణం చేపట్టాడు.

ఇలా అయితే లాభంలేదనుకుని విపక్షాలన్నీ కలిసి అఖిలపక్షంగా ఏర్పడ్డాయి. వైకాపా, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ వంటి పార్టీలన్నీ కలిసి టోల్‌గేటు నిర్మాణానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టాలని నిర్ణయించాయి. ఈ నెల 13వ తేదీన అఖిలపక్షం ఆధ్వర్యంలో కనుపర్తిపాడు వద్ద జాతీయ రహదారిపై భారీఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. హైవే మీద ట్రాఫిక్‌ను స్థంభింపజేశారు. ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్ కుమార్‌యాదవ్‌లతో పాటు పిసిసి ఉపాధ్యక్షులు ఆనం వివేకానందరెడ్డి, సిపిఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, సిపిఐ కార్యదర్శి పార్థసారధి, లారీఓనర్స్ అసోసియేషన్ నాయకులు గోపాల్‌నాయుడు, వైకాపా, కాంగ్రెస్, వామపక్షాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అయితే ప్రజలకు సంబంధించిన ఈ సమస్యపై జరిగే ఆందోళనకు టిడిపి, బీజేపీలు దూరంగా ఉండిపోయాయి.

టోల్‌గేటుపై ఆందోళన తీవ్రతరమవుతున్న నేపథ్యంలో ఈ టోల్‌గేటును ఆపేస్తున్నట్లు మున్సిపల్ మంత్రి పి.నారాయణ 13వ తేదీ సాయంత్రమే ప్రకటన పంపించడం విశేషం. మొత్తానికి పోరాడితే పోయేదేమీ లేదని, మహా అయితే సమస్య పరిష్కారమవుతుందని నిరూపించిన అఖిలపక్ష నాయకులందరికీ అభినందనలు.

# ఆగే గుండెను ఆడించిన అపోలో..




గుండె శస్త్రచికిత్స చేసుకున్న అమిత్ తల్లిదండ్రులకు 20వేల నగదును అందజేస్తున్న అపోలో సిబ్బంది

రెండున్నర నెలల వయస్సున్న అమిత్ అనే మగశిశువుకు అపోలో ఆసుపత్రి వైద్యులు అరుదైన గుండె శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. అపోలో ఆసుపత్రిలో మంగళవారం విలేకర్లతో శస్త్ర చికిత్స వివరాలను ఆసుపత్రి యూనిట్ హెడ్ డాక్టర్ విష్ణువర్ధన్, సీనియర్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ జి.వి.రమణకుమార్ వివరించారు. కోవూరు మండలం పోతి రెడ్డిపాలెంకు చెందిన షేక్ మస్తాన్ – మున్నీల రెండవ సంతానం అమిత్ ఆరోగ్యం బాగలేకపోతే పలు ఆసుపత్రుల్లో చూపించారన్నారు. బాలుడికి గుండె జబ్బు వుందని డాక్టర్లు చెప్పడంతో పదిరోజుల క్రితం అపోలోకు తీసుకొచ్చారని తెలిపారు. అమిత్‌కు తమ వైద్యులు వైద్యపరీక్షలు చేసి పుట్టుకతో వచ్చే గుండెజబ్బు పిడిఏ(పేషంట్ డక్టస్ ఆర్టియోసస్)గా గుర్తించి శస్త్రచికిత్స చేసారని తెలిపారు. నెల్లూరులో ఇప్పటి వరకు ఇలాంటి ఆపరేషన్ చేయలేదన్నారు. సీనియర్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ జి.వి. రమణకుమార్ మాట్లాడుతూ రక్త సరఫరా వ్యవస్థలో నాడీకణాల ఆటంకంతో పిడిఏ వ్యాధి వస్తుందన్నారు. చిన్నవయస్సులోనే ఆపరేషన్ చేయకపోతే భవిష్యత్తులో ప్రమాదం ఉంటుందన్నారు. గంటపాటు ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. గుండెవ్యాధితో బాధపడుతున్న అమిత్ తల్లిదండ్రులు నిరుపేదలు కావడంతో కేవలం రూ.50వేలకే గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సను అందించినట్లు డాక్టర్ విష్ణువర్ధన్ పేర్కొన్నారు. శస్త్రచికిత్సకు రూ.లక్షకు పైగా ఖర్చవుతుందని తెలిపారు. అపోలో ఆసుపత్రిలో పనిచేసే నర్సులు, సిబ్బంది తమవంతు సహాయంగా రూ.20వేలను అమిత్ తల్లిదండ్రులకు అందించారు. ఈ సమావేశంలో అపోలో ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ శంకర నారాయణ, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ సాయిమహేష్, డా॥ అమర్‌నాథ్‌తో పాటు బాలుడి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విక్రమ సింహపురి వీసీగా వీరయ్య



విక్రమ సింహపురి యూనివర్శిటి వైస్‌ఛాన్సలర్‌గా వలవర్ల వీరయ్య ఈ నెల 11వ తేదీ బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు దర్గామిట్టలోని ఎస్‌వియూ పరిపాలనా భవనంలో బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన ఆయనకు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పీఆర్ శివశంకర్, అధ్యాపకులు స్వాగతం పలికారు.

## నెల్లూరులో మరో బస్ డిపో

నెల్లూరుజిల్లాకు కొత్తగా రెండు బస్ డిపోలను మంజూరు చేశారు. ఇందులో ఒకటి కృష్ణపట్నంలో, రెండోది నెల్లూరు రూరల్‌లోని బుజబుజనెల్లూరు వద్ద ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. బస్‌డిపోతో పాటు గ్యారేజీ కూడా ఉంటుంది. ఒక్కో డిపోకు 8ఎకరాల స్థలం కావాలి. ఈమేరకు ఆర్టీసీ వాళ్లు కలెక్టర్‌ను స్థలం కావాలని కోరారు. జవహర్‌లాల్ నెహ్రూ నావెల్ అర్బన్ రెన్యూవల్ మిషన్‌లో భాగంగా జిల్లాకు 101కొత్త బస్సులు కేటాయించారు. నెల్లూరు నగరానికి రూరల్ ప్రాంతాలకు మధ్య రాకపోకలు పెంచాలన్న ఉద్దేశ్యంతో ఈ జెఎన్‌ఎంయు బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. బుజబుజ నెల్లూరులో ఈ డిపోకు 8ఎకరాల స్థలం అడిగారు. దీనిబదులు ఒకేసారి ఇంకా ఎక్కువ విస్తీర్ణం స్థలం తీసుకుంటే భవిష్యత్‌లో నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌ను ఇక్కడకు మార్చడానికి వీలుగా ఉంటుంది.





## చిన్నారులకు ప్రతిభా అవార్డులు

నెల్లూరు నగరంలోని చంద్రమౌళినగర్‌లో వున్న మైథిలి స్కూల్‌లో ఈ నెల 12న కిండర్‌గార్టెన్ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా ప్రతిభావంతులైన పలువురు విద్యార్థులకు ప్రతిభా అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నెల్లూరు మండల విద్యాశాఖ అధికారి జగదీష్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల పట్ల, చిన్నారుల్లో వున్న సృజనాత్మకశక్తిని పెంపొందించడం పట్ల బాగా శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం చదువులో ప్రతిభ కనుపరచిన పలువురు చిన్నారులకు ప్రతిభా అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మైథిలి స్కూల్ వ్యవస్థాపకుడు మనోహరరెడ్డి, ప్రైవేట్ పాఠశాలల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారెడ్డి, శేషారెడ్డి, మైథిలి స్కూల్ డైరెక్టర్లు రాధాకృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు ప్రతిభా అవార్డులను బహుకరించారు. తొలుత చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

### శ్రీ పినాకినీ విద్యాపీఠం ఆధ్వర్యంలో

## జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్య జయంత్యుత్సవాలు



నెల్లూరులోని శ్రీ పినాకినీ విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 27వతేది వరకు శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్య జయంత్యుత్సవాలను నిర్వహించనున్నామని, భక్తులందరూ ఆహ్వానితులేనని ఆ విద్యాపీఠం అధ్యక్షులు స్వయంపాకుల శ్రీనివాసులు, కార్యదర్శులు సివిఎల్ నరసింహం, దూబగుంట ప్రభాకరరావు తెలియజేశారు. స్థానిక ట్రంకురోడ్డులోని శ్రీ తిప్పరాజు వెంకటసుబ్బయ్య (టివిఎస్) కల్యాణసదనంలో పంచాహ్నిక దీక్షతో అయిదురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా, ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి ఆధ్యాత్మిక ఉపన్యాసాలుంటాయని వారు పేర్కొన్నారు. 23వ తేదిన 'శంకరుల తత్వబోధ' అనే అంశంపై డా.దీవి హయగ్రీవాచార్యులు (నేషనల్ కాలేజీ–నంద్యాల), 24న 'శంకర స్తోత్ర గ్రంథముల వేదాంత విశేషములు' అనే అంశంపై బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథశాస్త్రి (తెనాలి), 25న 'సప్త మీనముల వృత్తాంతము–అంతరార్థం' అనే అంశంపై బ్రహ్మశ్రీ డా.కడిమిళ్ళ వరప్రసాద్(నరసాపురం) ఉపన్యసిస్తారని వారు తెలిపారు. 26న 'పంచమవేదము–అద్వైత సారము' అనే అంశంపై కూడా బ్రహ్మశ్రీ డా.కరిమిళ్ళ వరప్రసాద్ ప్రసంగిస్తారని, 27న 'వేద ప్రాశస్త్యము' అనే విషయంపై బ్రహ్మశ్రీ గుళ్లపల్లి శివశర్మ అవధాని (పశ్చిమ గోదావరిజిల్లా–ఇరగవరం) ఉపన్యసిస్తారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాలను పురస్కరించుకుని ఈనెల 26న బాలాజీ నగర్‌లోని బ్రాహ్మణ సేవా సంఘం మహిళామండలి వారిచే 'లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం' వుంటుందని, అదే విధంగా 27 వ తేది ఉదయం 10 గంటలకు బ్రహ్మశ్రీ గుళ్ళపల్లి శివశర్మ అవధాని, బ్రహ్మశ్రీ మడమనూరు చంద్రశేఖరశర్మ అవధానులచే 'వేద సభ–వేదాశీర్వచనం' నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులందరూ ఈ ఉత్సవాలకు విచ్చేసి స్వామివార్ల కృపాకటాక్షాలను పొందవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

# నెల్లూరు కబుర్లు

## జగన్ వచ్చి వెళ్లాడు



వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు, ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి 14వ తేదీ నెల్లూరుజిల్లాలో పర్యటించారు. ఉదయం రేణిగుంట విమానాశ్రయంలో దిగిన ఆయన రోడ్డు దారిలో నాయుడుపేటకు చేరుకున్నారు. అక్కడ జరిగిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 125వ జయంతి వేడుకలలో పాల్గొన్నారు. అనంతరం నేరుగా అల్లూరు వెళ్లారు. మాజీఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి కుమార్తె నలుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ నుండి సంగం మండలంలోని గాంధీగిరిజనసంఘం చేరుకుని పర్వతారోహకుడు మల్లి మస్తాన్‌బాబు కుటుంబాన్ని పరామర్శించారు. మల్లి మస్తాన్‌బాబు ధైర్యసాహసాలను ప్రశంసించి ఆయన మృతికి నివాళులర్పించారు. అక్కడ నుండి నెల్లూరులోని పినాకిని అతిథి గృహానికి చేరుకుని కొద్దిసేపు పార్టీ నాయకులతో మాట్లాడి తిరిగి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు బయల్దేరారు.

## ఆర్టీసీకి ఎన్‌కౌంటర్ నష్టం

ఆర్టీసీ పట్ల శేషాచలం ఎర్రచందనం కూలీల ఎన్‌కౌంటర్ మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లుగా మారింది. అసలే ఆర్టీసీ నష్టాల్లో వుంది. గత ఏడాది ఆర్టీసీకి జరిగిన నష్టం, అరిష్టం అంతా ఇంతా కాదు. తెలంగాణ ఉద్యమం, సమైక్యాంధ్ర ఆందోళనలు, రాష్ట్ర విభజన... వీటి మూలంగా బాగా నష్టపోయిన సంస్థల్లో ఆర్టీసీ ముందు భాగాన ఉంటుంది. ఆ దెబ్బల నుండి కోలుకోకముందే ఇప్పుడు శేషాచలం ఎన్‌కౌంటర్ ప్రభావం కూడా ఆర్టీసీపై పడింది. చెన్నైకు నెల్లూరు నుండి ఆర్టీసీ బస్సులు నడపడం లేదు. ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారంగా తమిళనాడులో ఎక్కడ దాడులు చేస్తారోననే భయంతో చెన్నైకు బస్సులు నిలిపేసారు. దీంతో ఒక్క నెల్లూరు ఆర్టీసీకే కోట్ల రూపాయల్లో నష్టం వాటిల్లింది. చెన్నైకు వెళ్లే ప్రయాణీకులు తమిళనాడు బస్సులను, ప్రైవేట్ వాహనాలను, రైళ్లను ఆశ్రయించాల్సి వచ్చింది.

## నిధులేవి... నారాయణ

### - నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్



రాష్ట్ర మున్సిపల్ మంత్రిగా ఉంటూ నెల్లూరు నగరానికి నిధులు తేలేకపోవడం సిగ్గుచేటని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్‌యాదవ్ విమర్శించారు. 11వ తేదీ 14వ డివిజన్ పద్మావతినగర్, ఏసి నగర్ ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి నగరంలో అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. కార్పొరేషన్ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంతో పాటు అభివృద్ధి పనులు చేయాల్సి వుండగా పన్నులపై వడ్డీ భారాన్ని మోపి వసూళ్లకు దిగుతుండడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మాధవయ్య, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి శనివారం.. అన్నదానం



నెల్లూరులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి భక్తులు కొందరు ప్రతి శనివారం పేదలకు అన్నదానం చేసేందుకు సంకల్పించారు. గత శనివారం పలువురికి అన్నదానం చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఎన్జీఓ కాలనీకి చెందిన జమిలి జనార్ధనరావు ఆధ్వర్యంలో, ఆయన మిత్రులు అన్నం చిన్నయ్య, పి.లక్ష్మయ్య, జమిలి రామమోహనరావు, ఎ.అశోక్, ఎ.నారాయణ తదితరులంతా కలసి ఈ సేవాకార్యక్రమం నిర్వహిస్తున్నారు. తమతోపాటు మరింకెవరైనా పేదలకు అన్నదానం చేయాలని భావిస్తే, వారు తమను సంప్రదించవచ్చని, ఏడాదిలో వారు కోరిన రోజున వారి పేరుతో అన్నదానం చేయడానికి తాము సిద్ధమేనని వారు పేర్కొన్నారు. వివరాలకు ఫోన్: 9550226189కు సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.



# ఐఐఎస్ ర్యాంకర్‌కు ఐఫోన్

ప్రతి పనిని ప్రభుత్వ నిధులతోనే చేయాలన్న కాన్సెప్ట్‌తో కాకుండా తన పరిధిలో తన స్థాయిలో తనకు చేతనైన రీతిలో కొన్ని మంచి పనులు చేస్తున్న నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అందరూ మెచ్చే మరో మంచి పని చేశాడు. ఈమధ్య అసెంబ్లీ సమావేశాలు ముగిసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యేలందరికీ 60వేల విలువచేసే ఐఫోన్‌లను బహుమతిగా ఇచ్చింది. కోటంరెడ్డికి ఇటువంటి ఫోన్‌ల మీద మోజు లేదు. వాటిని వాడుకోవాలనే దురదలేదు. ఎమ్మెల్యేగా వున్నా సామ్‌సంగ్ కంపెనీకి చెందిన మామూలు ఫోన్‌నే ఉపయోగిస్తుంటారు. ఇప్పటికే ప్రభుత్వం ద్వారా వచ్చే జీతాన్ని, ఇతర ప్రోత్సాహకాలను ఆయన తన నియోజకవర్గ ప్రజలకే కేటాయించాడు. ఈ అత్యాధునిక ఐఫోన్‌ను పేదలకిచ్చినా ఉపయోగం వుండదు. కాబట్టి తన నియోజకవర్గంలోని ప్రతిభావంతులకిచ్చి ప్రోత్సహించాలనుకున్నాడు. అందుకే ఐఐఎస్‌లో 99వ ర్యాంకు సాధించిన హర్షవర్ధన్‌కు ఈ ఐఫోన్‌ను బహుమతిగా ఇవ్వాలనుకున్నారు. ఇటీవల ఆయన హరనాథపురంలోని ఐఐఎస్ ర్యాంకర్ హర్షవర్ధన్ ఇంటికెళ్లి ఈ ఫోన్‌ను అందించారు. అలాగే ఎంటెక్‌లో యూనివర్శిటీ ప్రథమర్యాంకును సాధించిన హర్షవర్ధన్ సోదరి హరిణిని కూడా ఆయన అభినందించారు. ఈ ప్రతిభావంతులను కనిపెంచిన 2వ పట్టణ ఏఎస్ఐ పుల్లారెడ్డిని, వారి సతీమణిని కూడా ఎమ్మెల్యే అభినందించారు.

### మరుగుదొడ్ల నిర్మాణాలను

# సత్వరం పూర్తిచేయాలి

**- ప్రవీణ్ ప్రకాష్**



జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల పరిధిలోనూ, నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోనూ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను సత్వరం పూర్తిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన నగర కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణాలు, నిర్వహణ బాధ్యతలను పొదుపు సంఘాలకు ఇవ్వాలని ఆయన అధికారులకు సూచించారు. గ్రామ స్థాయిలో కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణాలను స్ఫూర్తివంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి, కమిషనర్ చక్రధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. దగదర్తిలో విమానాశ్రయానికి స్థలాన్ని గుర్తించి కేంద్రప్రభుత్వానికి నివేదికను పంపామని తెలిపారు. అదేవిధంగా, ఫిషింగ్ హార్బర్, నేషనల్ హైవే కింద చేపట్టాల్సిన రహదారుల గురించి జాయింట్ సెక్రటరీకి కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్ చొరవతో గ్రావెల్‌రోడ్డుకు మోక్షం



కార్పొరేటర్ ఆనం రంగ మయూర్‌రెడ్డి చొరవతో నెల్లూరు నగరపాలక సంస్థ 12వ డివిజన్ పరిధిలోని వావిలేటిపాడు-చింతారెడ్డిపాలెం మధ్య గ్రావెల్ రోడ్డుకు మోక్షం లభించింది. ఈ రోడ్డు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. స్థానిక కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి ఈరోడ్డు దుస్థితిని, ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆరు నెలల క్రితం నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది. ఇటీవల నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి నగరపాలక సంస్థ అధికారులతో చర్చించి ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయించడంతో ఈ రోడ్డు ప్యాచ్‌వర్క్‌లు జరిగి రాకపోకలకు అనువుగా మారింది. మంగళవారం ఈ రోడ్డును ఆనం రంగమయూర్‌రెడ్డి పరిశీలించారు.

# వివాదాల భవన్




**నెల్లూరులోని జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యాలయమైన ఇందిరాభవన్ చుట్టూ వివాదాలు అలుముకోవడం తెలిసిందే! ఇందిరాభవన్ కాంగ్రెస్‌పార్టీది కాదని, ట్రస్ట్‌దని, దీనిని మా తండ్రి చెమటోడ్చి కట్టించాడని స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కొడుకు రాంకుమార్‌రెడ్డి వాదిస్తుండడం తెలిసిందే! ఈమధ్య ఆయన కాంగ్రెస్‌ను వదిలేసి బీజేపీలో చేరిపోయాడు. అయినా ఇందిరాభవన్‌పై తన వాదన వీడలేదు. జిల్లాలో ఒట్టిపోయిన కాంగ్రెస్‌పార్టీకి సంరక్షకుడిగా వున్న పీసీసీ ఉపాధ్యక్షుడు ఆనం వివేకానందరెడ్డి మాత్రం ఇందిరా భవన్ ఎవరి సొత్తు కాదని, కాంగ్రెస్ కార్యకర్తల రక్తంతో, కాంగ్రెస్ నాయకులందరి చెమటతో కట్టిందని, కాబట్టి ఇది కాంగ్రెస్ ఆస్థి అని చెబుతూ వస్తున్నాడు.**

మంగళవారం వివేకా తన పరివారంతో ఇందిరాభవన్‌లోకి వెళ్లారు. ఇందిరాభవన్ కార్యదర్శి టి.బాలసుధాకర్‌ను ఇందిరాభవన్ రికార్డులు ఇవ్వమని కోరాడు. అవి నా దగ్గరెందుకుంటాయని బాలసుధాకర్ చెప్పాడు. ఎక్కడ దాచి పెట్టావో తెచ్చివ్వమని వివేకా గట్టిగా అడిగే సరికి, నాకేం సంబంధం, నేను ట్రస్టు కార్యదర్శిని మాత్రమే, రికార్డులు నా వద్ద ఎందుకుంటాయంటూ బాలసుధాకర్ కూడా విసురుగా సమాధానం చెప్పాడు.

మా బాస్‌కే పెడద్రంగా సమాధానం చెబుతావా అంటూ వివేకా అనుచరులు సుధాకర్‌పైకి గయ్‌మంటూ లేవ బోయారు. వివేకా వారిని శాంతి... శాంతి అంటూ కూర్చోబెట్టి బాలసుధాకర్ ఇచ్చిన అకౌంట్స్ బుక్స్‌ను తీసుకున్నారు.

### గ్రామీణ విద్యార్థులకు

# మరిన్ని రాయితీలు కల్పించాలి

**- సీనియర్ పాత్రికేయులు కె.వి.రమణయ్య**



గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం మరిన్ని రాయితీలను, వసతులను కల్పించి, వారు చదువులో మరింత ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రోత్సహించాలని సీనియర్ పాత్రికేయులు కె.వి రమణయ్య అన్నారు. తన శ్రీమతి స్వర్గీయ కనుపర్తి రమాదేవి 75వ జయంతిని పురస్కరించుకుని ఆయన ఈనెల 10న కొడవలూరు మండలంలోని మిక్కిలింపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పెన్సిల్ బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమకు, తమ శ్రీమతికి ఈ గ్రామంతో గత 50 ఏళ్ళుగా వున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు కోడూరు చంద్ర శేఖరరెడ్డి, కొండూరు పరంధామిరెడ్డి, శ్రీనివాససింగ్, పాఠశాల హెడ్మాస్టర్ మస్తాన్‌వలితో పాటు పి.చెన్నయ్య, కనుపర్తి బాలసుబ్రహ్మణ్యం, కనుపర్తి శ్రీనివాసమూర్తి, మీనా, చుండి జ్యోతిలక్ష్మి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# రెయిన్‌బో కలర్స్ అండ్ గ్రాడ్యుయేషన్ డే



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని రెయిన్‌బో స్కూల్ 10వ వార్షికోత్సవాన్ని నెల్లూరు, అనిల్ గార్డెన్స్‌లో ప్లేక్లాస్, ఎల్‌కేజీ, యుకేజీ, నర్సరీ విద్యార్థులకు 'కలర్స్-2015' పేరుతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరుజిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి పాల్గొని మాట్లాడుతూ రెయిన్‌బో వారి కలర్స్-2015 కార్యక్రమానికి హాజరవడం ఎంతో ఆనందంగా వుందని, కేవలం 5సంవత్సరాల చిన్నారులకు ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించడాన్ని అభినందించారు. ప్రతి తల్లిదండ్రి వారి వ్యక్తిగత విషయాల్లో ఎంత బిజీగా వున్నా వారి సమయాన్ని కొంత పిల్లలతో గడపడానికి కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన వివిధ కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. చిట్టి చిన్నారులు ప్రదర్శించిన యాంట్స్ గో మార్చింగ్, మాకతాన, మైహై కోలి, బేబిడాన్స్, నంగా పుంగా, మనం సాంగ్, భూత్‌నాథ్, రంగీలో మారో డోల్‌నా, సునో మీరే మొదలగు కార్యక్రమాలు మంత్ర ముగ్ధుల్ని చేశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ అరుణాస్వయంప్రభ, ప్రీప్రైమరి ఇన్‌ఛార్జ్ ఫాతిమాఖాన్, కొరియోగ్రాఫర్స్ నందన్, నికేష్, సురేష్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



# గూడూరు డివిజన్ వార్తలు

## దేశీయ పరిజ్ఞానాన్ని పెంచుకుందాం

--- జగన్ విద్యాసంస్థల ఛైర్మెన్ జగన్మోహన్‌రెడ్డి ---



ధ్రువ పత్రాలను అందజేస్తున్న జగన్మోహన్‌రెడ్డి, ప్రక్కన ప్రిన్సిపాల్ విజయకుమార్

విదేశీ పరిజ్ఞానానికి ధీటుగా మనం కూడా ఎదగాలని, ఆ దిశగా ముందుకుపోవాలని జగన్ విద్యాసంస్థల ఛైర్మెన్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. గూడూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ఇటీవల ముగియడంతో విద్యార్థులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన మేక్ ఇన్ ఇండియా నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ వచ్చిందన్నారు. అనంతరం ధ్రువపత్రాలను 30మంది విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయకుమార్, గోపాల్‌రెడ్డి, జలీల్ బాషా, కో–ఆర్డినేటర్ సుశీల్‌కుమార్, మేజర్ పొనకా శ్రీనివాసులురెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద

## రైతుకు తప్పని తిప్పలు

- సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి యాదగిరి -



మాట్లాడుతున్న సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి యాదగిరి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులు కష్టనష్టాలు చవి చూడాల్సివస్తోందని సిపిఎం పార్టీ గూడూరు డివిజన్ కార్యదర్శి యాదగిరి తెలిపారు. స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో ఇటీవల జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు అవస్థలు ఎదుర్కోలేక వచ్చినకాడికి ప్రైవేటు మిల్లర్లకు అమ్ముతున్నారన్నారు. ఇందుకు అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. కార్యదర్శి కటికాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైస్‌మిల్లర్లకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. అధికారులు వెంటనే కొనుగోలు కేంద్రాలపై దృష్టి పెట్టి రైతులను ఇబ్బందులకు గురికాకుండా ఆదుకోవాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో నాయకులు కేశవులు, మణి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పూలే జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి



ప్రాంతీయ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ సంఘ నాయకులు

దేశ తొలి సామాజిక విప్లవ ఉద్యమ నాయకులు, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జీవితచరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని వివిధ సంఘాల నాయకులు కోరారు. జ్యోతిరావుపూలే 189వ జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలలో రాష్ట్ర అణగారిన వర్గాల సమాఖ్య, బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఉడతా శరత్‌యాదవ్, చల్లా రమణయ్య, మయూరి శ్యాంయాదవ్, అరవ పార్వతయ్య, గోను విక్రమ్, మల్లిఖార్జునరావు, కిషోర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## 35లక్షలతో అభివృద్ధి పనులు



మాయాబజారులో రోడ్డు పనుల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ప్రక్కన ఛైర్మెన్ పొనకా దేవసేన

గూడూరు పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ వార్డుల్లో ఉపప్రణాళిక నిధులు రూ.35 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. ఈ సందర్భంగా 11వ తేదీ 7, 8, 28వ వార్డుల్లో రోడ్డు పనులకు సంబంధించిన శిలా ఫలకాన్ని వారు ప్రారంభించారు. ఎమ్మెల్యే సునీల్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పట్టణంలో అభివృద్ధి పనులకు సహకరిస్తామన్నారు. నాయకులు కూడా అధికారులతో గౌరవభావం కలిగి పనులు చేయించుకోవాలన్నారు. ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ వార్డులపై తనకు భేదభావం లేదని, అన్నీ సమానమే నన్నారు. ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించేటట్లు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అశోక్‌నగర్, మాయాబజార్ ప్రాంతాల్లో శంకుస్థాపన చేశారు. వీరారెడ్డి పల్లెలో నిర్మించిన సిమెంట్‌రోడ్డును ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్ కుమార్, కౌన్సిలర్లు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, చంద్రయ్య, బాను, ఇజ్రాయిల్‌కుమార్, మస్తానమ్మ, నాశిన నాగులు, కల్పన, రమీజా, పావని, గిరి, తెదేపా నాయకులు గోను శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు ఎల్ఐసి

## పురోభివృద్ధిలో ఫస్ట్... బడ్జెట్‌లో సెకండ్

- రామూచౌహాన్



మాట్లాడుతున్న ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ రామూచౌహాన్, ప్రక్కన ఏబిఎమ్ ఆంజనేయులు

ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసి ప్రీమియంలో రూ.6.25 కోట్లకు గాను 6.31కోట్లు ప్రీమియం సాధించి మూడురాష్ట్రాల్లో మొదటి స్థానంలో గూడూరు ఎల్ఐసి బ్రాంచి నిలిచిందని బ్రాంచ్ మేనేజర్ రామూచౌహాన్ తెలిపారు. పట్టణంలోని గూడూరు ఎల్ఐసి బ్రాంచ్‌లో ఇటీవల ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాంచి పురోభివృద్ధిలో మొదటిస్థానం, బడ్జెట్‌లో రెండోస్థానంలో నిలిచిందని తెలిపారు. బ్రాంచి ఏర్పాటు చేసినప్పటినుండి ఇలాంటి విజయం ఎప్పుడూ సాధించలేదని, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు, సిబ్బంది సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ దేవసేన, కమిషనర్ ప్రమీల

గూడూరు పట్టణంలోని మున్సిపల్ వార్డుల అభివృద్ధి పనుల్లో భాగంగా వార్డుకు రూ.2లక్షలు చొప్పున గతంలో కేటాయించారు. ఈ నిధులతో చేసిన పనులను ఇటీవల ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన నరసింహరావుపేటలో పరిశీలించారు. పనుల్లో నాణ్యత లేకపోతే బిల్లులు మంజూరు చేయమని తెలిపారు. నరసింహరావుపేటలో కల్వర్టు పనుల్లో నాణ్యత లేదని, నీటితో క్యూరింగ్ కూడా చేయలేదని, కావాల్సిన వారు ఉన్న చోట కాలువలు నిర్మించారని మాజీకౌన్సిలర్ క్రిష్ణమనాయుడు పరిశీలించాలని ఛైర్‌పర్సన్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో

## ప్రజావినతుల స్వీకరణ

గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినం సందర్భంగా పలు గ్రామాల ప్రజలు సమస్యలను అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గీతావాణికి విన్నవించారు. బాలయపల్లి మండలం పిగిలాం గ్రామానికి చెందిన గోపాలయ్య తన పొలంలోకి హద్దులు చూపించాలని, మనుబోలు మండలం వడ్లపూడికి చెందిన కామాక్షమ్మ రైల్వేలైన్ క్రింద తమ భూమి తీసుకొన్నా పరిహారం అందించలేదని వినతిపత్రం అందజేశారు.

ఆర్డీవో రవీందర్ కోర్టు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లడంతో కార్యాలయ ఏవో ప్రజా వినతులను స్వీకరించారు.

## డాన్సులతో అదరగొట్టిన నర్సింగ్ విద్యార్థులు



నెల్లూరు పొదలకూరురోడ్డులోని సెయింట్ జోసఫ్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 10వతేదీ నిర్వహించిన డాన్స్ పోటీల్లో నర్సింగ్ విద్యార్థులు సినీ కొరియోగ్రాఫర్స్ స్థాయిలో పోటాపోటీగా నృత్యాలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. కాలేజీ ప్రిన్సిపల్ మరియమ్మ నేతృత్వంలో నిర్వహించిన నృత్యపోటీల్లో సోలో డ్యాన్స్‌లో 8మంది విద్యార్థులు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతు లను వరుసగా శశిక, మహిజ, సాప్నలు కైవసం చేసుకున్నారు. డ్యూయెట్ పోటీలలో 8మంది పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా మేనుక, సాప్న, ప్రవల్లిక, సుమంత, ఆధిర, ప్రియరాజ్‌లు అందుకున్నారు. గ్రూప్‌డాన్స్ పోటీల్లో నాలుగు గ్రూపులు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతు లను వరుసగా లూపిన్స్ గ్రూప్, డాఫోడిన్స్ గ్రూప్, బ్లూబెల్స్ గ్రూప్‌లు సాధించాయి. ఈ డాన్స్ పోటీలకు న్యాయనిర్ణేతలుగా మనుబోలు ప్రభాకరరావు, శింగంశెట్టి మురళీమోహన్‌రావులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ ఇన్‌ఛార్జి సిస్టర్ చార్లీ, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మేషం
అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాలు ఆశించిన స్థాయిలో ఉండక పోవచ్చును. అప్పుడప్పుడు అదనపు ఖర్చులు పైనబడ గలవు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసికొనాలి. స్థిరాస్తుల సంపాదనపై ఆలోచనలు పెరుగుతాయి. కుటుంబసౌఖ్యము బాగుంటుంది. వివాహ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా సాగుతూ విసుగు అనిపిస్తుంది.

## కన్య
ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

పనులు సరిగా జరగక, కొన్ని ముఖ్య విషయాలలో ఏం చేయాలో తోచక టెన్షన్ పడుతుంటారు. వ్యాపారవృద్ధి అవకాశాలు చేజారవచ్చు. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. ఖర్చులు అన్ని విధాల పెరుగుతాయి. బంధుమిత్రుల వల్ల ఇబ్బందులు పడగలరు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. రావలసిన బాకీలు నిలబడిపోతాయి.

## వృశ్చికం
విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

క్రొత్త పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాల ఆలోచనలు నిలబడిపోతాయి. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు తగ్గుతాయి. ఆదాయ వ్యయాలకు పొంతన సరిగా ఉండదు. అదనపు ఖర్చులు తప్పనిసరి. ఆర్థిక లావాదేవీలందు జాగ్రత్త పడండి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. బాకీల వత్తిడులు పెరుగుతాయి. బంధుమిత్రులతో పేచీలు ఏర్పడవచ్చును.

## వృషభం
కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆదాయం కంటే ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. వృత్తివ్యాపారాల వర్గాలకు అభివృద్ధి అవకాశాలు తగ్గగలవు. రాబడి తగ్గుతుంది. బంధుమిత్రుల అనారోగ్య వార్తలు వింటారు. అనుకున్న పనులను సమర్థవంతంగా జరుపుకొనగలరు. శుభకార్యాలు దైవ కార్యాలలో పాల్గొం టారు. మిత్రుల సహకారం బాగుంటుంది. కొత్త పదవులు, కొత్త బాధ్యతలు లభించే అవకాశం ఉన్నది.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 17.04.2015 నుండి**
**తేది. 23.04.2015 వరకు**

ఈ వారం మీనంలో కేతువు, మేషంలో రవికుజ బుధులు, వృషభంలో శుక్రుడు, మీనమేష వృషభ మిధున రాశులలో చంద్రుడు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని సంచరిస్తారు.

### పంచాంగము:
తేది 21 మంగళవారము అక్షయ తదియ మరియు పరుశు రామ జయంతి
తేది 23 గురువారము ఆదిశంకరాచార్య జయంతి

### ముహూర్తములు
• తేది 22 బుధవారము రాత్రి 12.0గంటల నుండి గంట 2.0లోగా గృహ ప్రవేశ వివాహములు మకరము. • తేది 23 గురువారము ఉదయం గంట 9.0 నుండి గంట 11.0లోగా శంకుస్థాపన, ఉపనయనములు మిధునము.

### చైత్ర మాస బహుళపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 17 | శుక్ర | చతుర్దశి | రా॥ గం.2.58వ॥ |
| తేది. 18 | శని | అమావాస్య | రా॥గం.12.42వ॥ |

### వైశాఖమాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 19 | ఆది | పాడ్యమి | రా॥గం.10.48వ॥ |
| తేది. 20 | సోమ | విదియ | రా॥గం.9.04వ॥ |
| తేది. 21 | మంగళ | తదియ | రా॥గం.7.43వ॥ |
| తేది. 22 | బుధ | చతుర్థి | రా॥గం.7.52వ॥ |
| తేది. 23 | గురు | పంచమి | రా॥గం.6.23వ॥ |

## ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ముఖ్య వ్యవహారాలు, అనుకున్న పనులు సక్రమంగా జరుగును. వ్యాపారవర్గాలకు మంచి అవకాశాలు లభించి, ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలు కొంత అందుతాయి. కోర్టు కేసులందు అనుకూలత ఉంటుంది. బహుమతులు కానుకల ఖర్చులు పెరుగు తాయి. దూరప్రయాణాలు, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. ఉద్యోగప్రయత్నాలలో అనుకూలతుంది.

## మిధునం
మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఖర్చులు పెరిగినా ఆదాయానికి లోపంరాదు. వృత్తి వ్యాపారాలు స్వల్ప ఇబ్బందులుండి అభివృద్ధి బాగుం టుంది. కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుండ వచ్చును. గృహవస్తు వాహన రిపేర్ల ఖర్చులుండవచ్చును. బంధుమిత్రులతో సత్సంబంధాలు బలపడతాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. అల్లులతో తగాదాలు కలిగే అవకాశం ఉంది కాబట్టి జాగ్రత్త పడండి.

## మకరం
ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థికాభివృద్ధి పథకాలు ఫలించి వృత్తి వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులను ప్రణాళికా బద్ధంగా జరుపుకొంటారు. ఉద్యో గార్థులకు అనుకూల సమయం. శుభకార్యాలకు వెళ్లడం, ప్రయాణాలలో ఇబ్బందులు పడటం ఉంటుంది. ఉద్యో గులకు పని వత్తిడి, అధికారుల వల్ల సమస్యలుంటాయి. పెట్టుబడులు షేర్ల మీద లాభాలుంటాయి.

## కర్కాటకం
పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలు ఆలస్యంగా అందుతాయి. వాణిజ్య, వ్యవహార ఒప్పందాలు జరిగే అవకాశం ఉన్నది. కొత్త వస్తువులు, యంత్రాలు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు నిదానంగా సవ్యంగా జరుగుతాయి. బంధు మిత్రలను కలుసుకొనడం, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. చిన్న ఉద్యోగావకాశాలుంటాయి.

## కుంభం
ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

బాగా శ్రమపడితే గాని పనులు జరగవు. కుటుం బంలో కొద్దిపాటి అశాంతి ఏర్పడుతుంది. వ్యాపారము లలో వృత్తులలో అభివృద్ధి, పెట్టుబడి అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. వేడుకలు శుభకార్యా లలో పాల్గొంటారు. చిన్న వ్యాపారులు, కుటీరపరిశ్రమల వారికి ఆర్థికంగా బాగుంటుంది. బిడ్డల వివాహ ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. పెట్టుబడుల మీద లాభాలు, అధికార అనధికార పర్యటనలుంటాయి.

## సింహం
మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకున్న పనులు నిదానంగా జరుగుతుంటాయి. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. బిడ్డల వల్ల కొద్ది సమస్యలు రావచ్చును. కొత్త వ్యాపారాలు చేయడానికి, పెట్టుబడులకు అనుకూల సమయం. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం బాగుండినా, కొన్ని అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. అవగాహన లేని విషయాలకు దూరంగా ఉండటం మంచిది.

## తుల
చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. వృత్తి వ్యాపా రాలలో అభివృద్ధి, మంచి అవకాశాలు దొరుకుతాయి. ఆదాయం పెరుగుతుంది. కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. తొందరపాటుతో వ్యవహరించవద్దు. వేడుకలు శుభకార్యాలు దైవకార్యాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలుంటాయి. షేర్లు ఆశిం చిన విధంగా ఉండవు. కుటుంబసౌఖ్యమున్నది.

## మీనం
పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆత్మీయులకు సహాయ సహకారాలు అందిస్తారు. రావలసిన బాకీలు, కోర్టు కేసులు వాయిదా పడతాయి. ఆందోళనకరంగా ఉన్న సమస్యలు పరిష్కారం కాగలవు. వృత్తి వ్యాపారాలలో రాబడి పెరుగుతుంది. ఆర్థికావ కాశాలు అందిపుచ్చుకుంటారు. సమావేశాలు, శుభ కార్యాలలో పాల్గొంటారు. ఉద్యోగావకాశాలు లభించ గలవు. కుటుంబసౌఖ్యము బాగుంటుంది.

# పూలే పోరాటలు చిరస్మరణీయం

అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన పోరాటాలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ యం.జానకి అన్నారు. పూలే 189వ జయంతిని పురస్కరించుకుని నెల్లూరులోని మినీబైపాస్‌రోడ్డులో పూలే దంపతుల విగ్రహాలకు కలెక్టర్ పూల మాలలు వేసి నివాళలులర్పించి మాట్లా డుతూ సామాజిక అసమానతలపై చివరి శ్వాస వరకు ఉద్యమించిన మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్త్రీ విద్యపై నిషేధం ఉన్న రోజుల్లో మొట్ట మొదటి మహిళా పాఠశాలను ఏర్పాటు చేసి స్త్రీ విద్యకు నాంది పలికారన్నారు.



ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జాయింట్‌కలెక్టర్ ఇంతియాజ్, అడిషనల్ జాయింట్ కలెక్టర్ సాల్మన్‌రాజ్‌కుమార్, బిసి సంక్షేమాధికారి వై.సంజీవరావు, బిసి కార్పొరేషన్ ఇడి కోటేశ్వరరావు, డ్వామా పిడి వెంకట సుబ్బయ్య, డిఆర్‌డిఏ పిడి చంద్రమౌళి, ఐటిడిఏ పివో వెంకటేశ్వర్లు, సోషల్ వెల్ఫేర్ డిడి ప్రసాదరావు, జిల్లా గిరిజన సంక్షే మాధికారి నారాయణుడులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

జిల్లాలో వున్న సుమారు రెండున్నర లక్షల మంది విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన నిధులను అందజేసి ఆదుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. నెల్లూరులోని విశ్వబ్రాహ్మణ సేవాసంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని విశ్వబ్రాహ్మణు లంతా సంఘటితంగా వుండాలన్నారు. జిల్లా నూతన కార్యవర్గం ఎంపికలో గతంలో కొంత విభేదాలు చోటు చేసుకున్నాయని, వాటిని సమసిపోయేలా చేశామన్నారు. నూతన కార్యవర్గంతో పాటు పూర్తి కార్యవర్గాన్ని ఎంపిక చేసుకునే అధికారం జిల్లా అధ్యక్షుడు రొంపిచెర్ల శివరామయ్య ఆచారికి ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘానికి గౌరవాధ్యక్షులుగా కందుకూరు చెంగయ్యఆచారి, అధ్యక్షునిగా రొంపిచెర్ల శివరామయ్యఆచారి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పేట మాధవయ్య ఆచారి, ప్రధాన కార్యదర్శిగా కాపులూరు చెంచుకృష్ణయ్య ఆచారి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఇందుకూరు రమేష్‌కుమార్ ఆచారి, ఉపాధ్యక్షునిగా ఆచారి మోహనాచారి, సహాయకార్యదర్శిగా వాసిలి సుధాకర్ ఆచారిలను నియామకం చేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు.

# సాధికారత దినంగా ప్రకటించాలి



మహాత్మా జ్యోతిరావు పూలే జన్మదినోత్సవాన్ని బిసిల సాధికారత దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించాలని బిసి జనసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శి యస్.యస్.యాదవ్, కార్యవర్గం జిల్లా కలెక్టర్ జానకికి మెమొ రాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసి జనసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రఘురామ్, జిల్లా అధ్యక్షుడు పి.యల్.రావు, జిల్లా ప్రధానకార్యదర్శి జి.కళ్యాణ్, నగర అధ్యక్షుడు వి.సురేంద్రబాబు, నగర ప్రధానకార్యదర్శి కె.మురళీమోహన్‌రాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు యు.బ్రహ్మయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పర్వతారోహకుడికి
# అనాథల సంతాపం

పర్వతారోహకుడు మల్లి మస్తాన్‌బాబు మృతికి జనసేన పార్టీ ఆధ్వర్యంలో అనాథ పిల్లలతో 11వ తేదీ సంతాపం తెలియ జేశారు. నెల్లూరు బట్వాడిపాలెంలోని అనాథపిల్లల ఆశ్రమంలో కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించారు. ఈ సంద ర్భంగా జనసేనపార్టీ నాయకుడు టోనీ మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ వ్యక్తి మస్తాన్‌బాబు మన జిల్లాలో జన్మించడం జిల్లా ప్రజలందరూ గర్వించదగ్గ విషయ మన్నారు. మస్తాన్‌బాబు మృతదేహం స్వగ్రామానికి వచ్చినరోజు పాఠశాలలకు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమా రావు, వెంకి, తుఫీల్, బాబూ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మస్తాన్‌బాబు జీవితాన్ని
# పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

నెల్లూరుజిల్లాలోని సంగం మండలం గాంధీజనసంఘం అనే చిన్నకుగ్రామంలో, పేద కుటుంబంలో జన్మించి, దేశం గర్వపడేవిధంగా పర్వతారోహణలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మల్లి మస్తాన్‌బాబు జీవితచరిత్రను బాలబాలికలు, యువతకు స్ఫూర్తిగా వుండేవిధంగా పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఒంగోలు సుధీర్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 12న నెల్లూరులోని కనకమహల్ సెంటర్‌లో వున్న పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో, మల్లి మస్తాన్‌బాబు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. పేదరికాన్ని సైతం అధిగమించి, ఎంతో సాహసాత్మకమైన పర్వతారోహణలో మల్లి మస్తాన్‌బాబు అంతర్జాతీయ ఖ్యాతినార్జించడం, భారతదేశానికి ఘనకీర్తిని తేవాలనే తపనతో ఉన్నతమైన ఉద్యోగాన్ని కూడా వదులుకుని లక్ష్యసాధన కోసం ముందుకు పయనించడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. అచంచలమైన కృషి, పట్టుదలతో మల్లి మస్తాన్‌బాబు చేసిన సాహసకృత్యాలు సింహపురి సీమకే కాక, దేశానికే గర్వకారణమన్నారు.

ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర అధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం, కె.బాబు, ఎస్‌డి సర్తాజ్, కటారి బాబు, సురేష్, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ వైభవం...!



ఈ నెల 8వ తేదీన హైదరాబాద్‌లోని ఎన్-కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన మాజీమంత్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మనుమడు, వైకాపా జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కుమారుడు **రజిత్‌రెడ్డి - పూజ**ల వివాహ నిశ్చితార్థం వేడుకలో పాల్గొని కాబోయే దంపతులను ఆశీర్వదిస్తున్న జివికె ఇండస్ట్రీస్ అధినేత గునుపాటి వెంకటకృష్ణారెడ్డి, శ్రీమతి ఇందిర దంపతులు.



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి - సంపూర్ణల కుమార్తె **నాగజ్యోతి - రామకృష్ణారెడ్డి** (హైదరాబాద్ వాస్తవ్యులు కోడూరు నరసింహారెడ్డి - సునీతల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 15వ తేదీ నెల్లూరు ధనలక్ష్మీపురంలోని కెజికె కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. వధూవరులను 'లాయర్' శుభాకాంక్షలు.



శ్రావణ్య హోటల్ అధినేత మాచవరం వెంటేశ్వర్లు - శ్యామలల కుమార్తె **శ్రావణ్య - డా॥ సురేష్‌కుమార్** (తాడిపత్రి వాస్తవ్యులు కె.రామకృష్ణ - పాపమ్మల కుమారుడు)ల వివాహం ఈ నెల 15వ తేదీ నెల్లూరు సిపిఆర్ కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనెలు.

## పర్వత పుత్రుడికి.. వైయస్ తనయుడి నివాళి



ఈ నెల 14వ తేదీన సంగం మండలం గాంధీగిరిజన సంఘంలోని పర్వతారోహకుడు మల్లి మస్తాన్‌బాబు ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైకాపా అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి

# ఉచ్చు బిగుస్తోంది!

(మొదటిపేజీ తరువాయి)

నేరగాళ్లు పేట్రేగిపోకుండా పోలీస్ భయం పెట్టడానికి ఎన్‌కౌంటర్లను ప్రయోగిస్తుంటారు. సీమాంతర ఉగ్రవాదులతో లేదా మావోయిస్టులు, ఇతర రాష్ట్రాల్లో వున్న వేర్పాటువాదులతో ఎదురెదురు కాల్పులు జరిగినప్పుడు ఎన్‌కౌంటర్‌లు చోటుచేసుకుంటుంటాయి. ఇలాకాకుండా కొందరు క్రిమినల్స్‌ను తప్పించుకోబోతే పోలీసులు కాల్చి చంపుతుంటారు. ఇలాంటి ఎన్‌కౌంటర్‌లపై మానవహక్కుల సంఘాలు, పౌరహక్కుల సంఘాలు విపరీతంగా స్పందిస్తుంటాయి. ఇవి బూటకపు ఎన్‌కౌంటర్‌లని, వీటిమీద విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తుంటాయి. అయితే ప్రజలు మాత్రం కరడుగట్టిన నేరస్తులను ఎన్‌కౌంటర్ చేసినప్పుడల్లా... తమ మద్దతు ప్రకటిస్తూనే వుంటారు. ఇలాంటి క్రిమినల్స్‌కు కోర్టుల్లో శిక్షలు పడవని, ఇలాంటివారిని ఎన్‌కౌంటర్‌లలోనే చంపాలని జనం కూడా కసిగా అంటుంటారు.

గతంలో దేశంలోనూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎన్నో ఎన్‌కౌంటర్‌లు జరిగాయి. చిత్తూరుజిల్లాలో సీరియల్ మర్డర్స్ చేసిన అన్నదమ్ములను పోలీసులు ఎన్‌కౌంటర్ చేసారు. ఇది ఒరిజినలా? నకిలీ ఎన్‌కౌంటరా? అని ప్రజలు ప్రశ్నించలేదు. చచ్చినవాళ్లు మహాత్ములు, జాతినేతలు కాదు, ఎందరి ప్రాణాలో తీసిన రాక్షసులు. ఇలాంటి వాళ్లు భూమ్మీద ఉంటే ఇంకా ఎంతోమందిని చంపుతారని, కాబట్టి ఇలాంటి వారికి ఇదే సరైన శిక్ష అన్నవారు లేకపోలేదు. వై.యస్. సీఎంగా వున్నప్పుడు వరంగల్‌లో ఓ విద్యార్థినిపై యాసిడ్ పోసిన నలుగురు యువకులను ఎన్‌కౌంటర్ చేసారు. ఆరోజు రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, విద్యార్థినులు రోడ్ల మీదకొచ్చి పోలీసులకు పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో ఇలాంటి ఎన్‌కౌంటర్‌లు ఎన్నో జరిగాయి. కాని ఎప్పుడూ వ్యతిరేకత రాలేదు. కారణం... ఎన్‌కౌంటర్‌లో చనిపోయినవాళ్లు అమాయకులు, దేశభక్తులు కాదు. రౌడీలు, గూండాలు, ఖూనీకోరులు.

అంతెందుకు ఈ నెల 7న తెలంగాణలో వికారుద్దీన్ గ్యాంగ్‌ను ఎన్‌కౌంటర్ చేసారు. ప్రజలు దీనికి మద్దతు తెలిపారు. కాని అదేరోజు ఆంధ్రప్రదేశ్‌లోని శేషాచలం అడవుల్లో జరిగిన 20మంది ఎర్రచందనం కూలీల ఎన్‌కౌంటర్‌కే ప్రజలు మద్దతు తెలపడం లేదు, సరికదా 20మంది కూలీలను చంపడం ఏం న్యాయమని ప్రశ్నిస్తున్నారు. శేషాచలం ఎన్‌కౌంటర్ కేసు ప్రభుత్వం మెడకు ఉచ్చులా బిగుసుకోబోతుంది. జాతీయ మానవహక్కుల సంఘం దీనిని సీరియస్‌గా తీసుకుంది. ఈ ఎన్‌కౌంటర్‌పై పూర్తిస్థాయి విచారణకు దిగింది. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసుల వివరాలను కోరింది. మరోపక్క ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా సాక్ష్యాలు నమోదవుతున్నాయి. నిరాయుధుల్ని తీసుకెళ్లి కాల్చి చంపారని, సాటి కూలీలే సాక్ష్యంగా చెబుతున్నారు. దేశవ్యాప్తంగా కూడా ఈ ఎన్‌కౌంటర్ జరిగిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసు ఎన్‌కౌంటర్‌లు ఏ విధంగా ఉంటాయో అందరికీ తెలుసు. అయితే ఆ ఎన్‌కౌంటర్‌లలో టెర్రరిస్టులను, ఖూనీకోర్లను చంపితే పెద్దగా పట్టించుకోరు. కాని ఇక్కడ చనిపోయింది పొట్టకూటి కోసం వచ్చిన కూలీలు. వాళ్లు వచ్చింది తమిళనాడు నుండే అయినా తీసుకొచ్చింది ఇక్కడ స్మగ్లర్లే! ఎర్రచందనం కొడితే వాళ్లకు వచ్చేది కూలీ మాత్రమే. కోట్లు కొల్లగొట్టేది స్మగ్లర్లు. కాని ప్రభుత్వం స్మగ్లర్‌లను వదిలేసి కూలీలను అది కూడా 20మందిని చంపడంపై విమర్శలు చుట్టుముడుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌తో ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తలెత్తాయి. ఆంధ్రులంటేనే తమిళులు మండి పడుతున్నారు. తమిళనాడుకు ఏపిఎస్ఆర్టీసీ బస్సులను నడిపే పరిస్థితి కూడా లేకుండాపోయింది.

ఇంకోపక్క పోలీసులకూ ఈ ఎన్‌కౌంటర్ కేసు తలనొప్పిగా మారే అవకాశముంది. అనాలోచితంగా వ్యవహరించి అనవసరమైన వివాదంలోకి పోలీసు శాఖను నెట్టిందీ ప్రభుత్వం.

# భగ్గుమంటున్న తమ్ముళ్లు!

(మొదటిపేజీ తరువాయి)

రకంగా వుంది. ఒకాయనది ముప్ఫైయేళ్ల సీనియార్టీ, పార్టీ పుట్టినప్పటి నుండి అందులోనే వున్నాడు. పార్టీ కోసం ఆస్తులు కూడా అమ్ముకున్నాడు. కాని పార్టీ అధికారంలోకి వచ్చాక ఆయనకంటే కూడా ఇతర పార్టీల నుండి వలసవచ్చిన వాళ్లకు పార్టీ పెద్దపీట వేయసాగింది. ఇంకొకాయన చూస్తే ప్రతిపక్షంలో వున్న పదేళ్లు పార్టీని అన్నీ తానే అయ్యి నడిపించాడు. చంద్రబాబు చెప్పిన చోటల్లా పోటీ చేశాడు. ఓడిపోతానని తెలిసినా పార్టీ కోసం మునిగిపోవడానికి సిద్ధపడ్డాడు. పార్టీ కోసం ఆర్థికంగా చితికిపోయాడు. పార్టీ అధికారంలోకి వచ్చాక ఆయనకు గౌరవం, గుర్తింపు వస్తుందనుకుంటే ఉన్న విలువ కూడా లేకుండా చేశారు. మరొకాయన పార్టీకి వెట్టి చాకిరి చేశాడు. అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ ఇస్తామని ఆశపెట్టారు. అతను కుర్చీలో కూర్చోబోయే సమయానికి చేయి పట్టి లాగేసారు.

జిల్లాలో నిఖార్సయిన తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు నిర్లక్ష్యానికి గురవుతున్నామనే ఆవేదనతో ఉన్నారు. దీనికి ప్రధానకారణం మంత్రి నారాయణేననేది వారి ఉద్దేశ్యం. ఆయన నెల్లూరుజిల్లాకు చెందినవాడే అయినప్పటికి ఈ జిల్లాకు చెందిన మంత్రిగా ప్రాతినిధ్యం వహించడం లేదని నాయకుల బాధ. మా జిల్లాకు ఇది కావాలని దేని కోసం కూడా ఆయన చంద్రబాబు వద్ద పట్టుబట్టడం లేదు. సరే, అభివృద్ధి విషయాలను వదిలేద్దాం. జిల్లాలో పార్టీని ఎన్నో ఏళ్ల నుండి నమ్ముకుని వున్న నాయకులు, కార్యకర్తలకు కూడా ఆయన న్యాయం చేసే ప్రయత్నం చేయలేదు. అసలు వారికి గుర్తింపే లేకుండా పోయింది. నారాయణ వల్లనే కాంగ్రెస్, వైకాపాల నుండి వలసొచ్చిన నాయకులకు తెలుగుదేశంలో ప్రాధాన్యత పెరిగింది. దీనిని సీనియర్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ముఖ్యంగా ఆయన పార్టీ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వకుండా కొందరు బ్రోకర్లను ఏర్పాటు చేసుకుని, వాళ్ల ద్వారానే కార్యకలాపాలు సాగిస్తుండడం పార్టీ కేడర్‌కు మింగుడుపడడం లేదు. మంత్రితో పనిపడిన వాళ్లందరూ ఈ మీడియేటర్లను ఆశ్రయించాల్సి వచ్చేసరికి వాళ్ల మనసులు ఉసూరుమంటున్నాయి. పార్టీలో ఇంత బ్రతుకు బతికి పార్టీకి ఏ సంబంధం లేకుండా ఇతర పార్టీల నుండి వలస వచ్చిన ఈ మీడియేటర్ల ద్వారా మన పనులు చేయించుకోవడం కంటే ఊరుకుండిపోవడమే మేలనుకుంటున్నారు. దీంతో తెలియకుండానే మంత్రి మీద అసమ్మతి తీవ్రస్థాయిలో పెరిగిపోయింది. ఎవరి ప్రమేయం లేకుండా, ఎవరితో మాట్లాడుకుండా, ఎవరి సలహా తీసుకోకుండా జిల్లాలో కొందరు ఇతర పార్టీల నాయకులను తెలుగుదేశంలోకి చేర్చుకోవడాన్ని ఇప్పటికి కూడా కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. ముందొచ్చిన చెవుల కంటే వెనుకొచ్చిన కొమ్ములే వాడి అన్నట్లుగా వలస నాయకులు కాలరెగరేస్తూ పార్టీలో పెత్తనం చెలాయించడానికి మంత్రి వ్యవహారశైలే ప్రధాన కారణమనేది పార్టీలో నూటికి 99మంది ఉద్దేశ్యం.

ఇక మా జిల్లాకు ఎమ్మెల్సీ కావాలనిగాని, నామినేటెడ్ పదవులు కావాలని గాని మంత్రి గట్టిగా అడగడం లేదు. మంత్రి గట్టిగా అడిగి వుంటే మొన్న ఎమ్మెల్యేల కోటాలోనే బీద రవిచంద్రకు ఎమ్మెల్సీ వచ్చేది. మంత్రి చొరవ చూపితే టిటిడి బోర్డుకి జిల్లా నుండి సీనియర్ నాయకుడైన వేనాటి రామచంద్రారెడ్డి పేరు వినపడేది. జిల్లాలో పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు ఇకనైనా న్యాయం చేసే పరిస్థితి లేకపోతే, ఈరోజు కాకున్నా రేపయినా వారిలోని అసంతృప్తి కోపాగ్నిలా బద్ధలు కావడం ఖాయం.

శ్రీను గల్పిక

# రాష్ట్రంలో వైన్‌షాపులు ఎత్తేయండి

## - నారాయణకు చంద్రబాబు షాక్

అది అంతర్జాతీయ రాజకీయ ప్రపంచానికి బ్రాండ్ అంబాసిడర్లుగా చెప్పుకోదగిన నాయకులున్న నెల్లూరు నగరం. నైట్‌రైడర్, ముదురుదోమల శాఖ మంత్రి పి.నారాయణ ఆరోజు నగరంలో ఏర్పాటు చేసిన నాలుగు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో చేరండని, త్వరపడితే పదవులు ఇస్తామని, ఈ బంపర్ బొనాంజాను మిస్ చేసుకోవద్దని వైకాపా, కాంగ్రెస్ వాళ్లకు పిలుపునిచ్చాడు. ఆ వెంటనే తెలుగు దేశం భవన్‌లో చేరిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పదేళ్లపాటు పార్టీకి చాకిరీ చేసిన కార్యకర్తలకు పదవులు ఇవ్వడం లేదని, వాళ్లకు న్యాయం చేయాలంటూ కొందరు కార్యకర్తలు నిలదీశారు. దానికి మంత్రి నారాయణ తీవ్రంగా స్పందించారు. ఇక్కడ కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీల నుండి వస్తున్న వాళ్లకే పదవులు సర్దలేక సతమతమవుతున్నాం, ఇక మీకు పదవులు ఎక్కడ నుండి తెచ్చివ్వాలి, మీరు పార్టీలో ఉంటే ఉండండి, లేదంటే వెళ్లిపోండి, మిమ్మల్నెవరూ ఉండమని ఇక్కడ బ్రతిమలాడడం లేదు అని కసురుగా అన్నాడు. అక్కడే వున్న అనూరాధ, రమేష్‌రెడ్డి, అంచల వాణి వంటి వాళ్లు... భలే చెప్పార్సార్, ఇప్పటిదాకా ఇలా చెప్పే వాళ్లు లేకే ఇలా తయారయ్యారు. సిగ్గొచ్చేటట్లు సమాధానం చెప్పారు అంటూ అభినందించారు. నారాయణ ఆ కార్యక్రమాన్ని ముగించుకుని నారాయణ ఆసుపత్రిలోని తన ఇంటికెళ్లారు. అప్పటికి రాత్రి 11గంటలైంది. ఆయనకు నిద్ర రావడం లేదు. వెంటనే ఇరిగేషన్, పంచాయితీరాజ్ ఎస్ఇ, డిఇలను పిలిపించుకుని దగ్గరలో వున్న వావిలేటిపాడు, కాకుపల్లి చెరువులను పరిశీలించడానికి వెళ్లాడు. ఆ చెరువుల్లో నీళ్లు లేకపోవడం చూసి... ఇవి ఎందుకు ఎండిపోయాయని అధికారులను అడిగాడు. వర్షాల్లేక ఎండిపోయాయని వాళ్లు చెప్పారు. అందుకు మంత్రి కోపంగా... వర్షాలు రాకపోతే చెరువులు ఎండిపోతాయని మాకు తెలియదా... చెరువుల్లో నీళ్లుండే విధంగా ముందస్తు ఏర్పాట్లు చేయలేరా? అని కసురుకుంటూ కారెక్కి ఇంటికి వచ్చాడు. అప్పటికి అర్థరాత్రి ఒంటిగంటయ్యింది. తన పి.యస్.ను పిలిచి రేపు ఉదయాన్నే 6గంటలకు ప్రెస్‌మీట్... విలేకరులందరికీ చెప్పమన్నాడు. పి.యస్. వుండి... రేపు కాదు సార్, ఈరోజే అని చెప్పాలి. ఆల్ రెడీ డేట్ మారిపోయి గంటయ్యింది, అయినా మీడియా వాళ్లంతా ఇంతకుముందే ఇక్కడ నుండి వెళ్లార్సార్, ఇంతలోకే మళ్లీ లేచి రాలేరేమో అని చెప్పాడు. నారాయణ అందుకుని... ఈసారి నుండి మీడియా వాళ్లకు కూడా ఆసుపత్రిలో ఖాళీగా వున్న బెడ్లు చూపించండి, రాత్రికి అక్కడే పడుకుని ఉదయాన్నే ప్రెస్‌మీట్‌కి రాగలరు అని అందరికీ గుడ్‌నైట్ చెప్పి బెడ్‌రూంలోకి వెళ్లి తలుపేసుకుని నిద్రకు ఉపక్రమించాడు.

★★★★★

హైదరాబాద్‌లో మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయం. ఆయన కంప్యూటర్‌లో రాజధాని ఫార్ములా కోసం వివిధ నగరాలను పరిశీలిస్తుండగా అమెరికాలోని లాస్‌వెగాస్, కాలిఫోర్నియా వంటి సిటీలు గుర్తుకొచ్చాయి. మా బాస్ ఎంతసేపటికీ సింగపూర్, కౌలాలంపూర్ అంటున్నాడు, ఈ సిటీలను కూడా ఒకసారి చూసొస్తే సరిపోతుంది కదా, ఎలాగూ లోకేష్‌బాబు కూడా విశ్రాంతి కోసం అమెరికాకు వెళ్లి ఉన్నాడు. ఆయన మంచి చెడ్డలు కూడా చూసినట్లుంటుందనుకున్నాడు. వెంటనే అమెరికాకు బయల్దేరాడు. అక్కడ లాస్‌వెగాస్, కాలిఫోర్నియా నగరాలను పరిశీలించాడు. సింగపూర్ కంటే ఈ నగరాలే బాగున్నాయనుకున్నాడు. తర్వాత లోకేష్ బాబు ఒక రిసార్ట్స్‌లో ఉన్నాడని తెలుసుకుని అక్కడకు వెళ్లాడు. అక్కడ ఓ స్విమ్మింగ్ ఫూల్ వుంది. అక్కడ అమ్మాయిలు ఒంటిమీద నిండుగా గుడ్డకప్పుకోవడానికి కూడా గతిలేనంత బీదరికంతో ఉన్నట్లున్నారు. వారిని చూస్తూ నారాయణ మనసులో... ఇలాంటి చోట్లకు వస్తే ఈ ఛంఢాలమంతా చూడాల్సి వస్తుంది... ఖర్మ ఖర్మ... అని తిట్టుకుంటూ లోకేష్ కోసం వెదక సాగాడు. ఆయన కళ్లకు ఓ చెట్టు కింద కూర్చుని వున్న లోకేష్ కనిపించాడు. ఆయన లాల్చీ, పైజామా వేసి, నుదుటున బొట్టుపెట్టుకుని 'అపరిచితుడు' సినిమాలో రామాచారిలా వున్నాడు. చేతిలో ఆధ్యాత్మిక పుస్తకముంది. ఆయన ఈ లోకంతో పనిలేనట్లు మేనక డ్యాన్స్ చేస్తున్నా చలించని విశ్వామిత్రుడిలా పుస్తకం చదువుకుంటున్నాడు. లోకేష్‌ను చూసి నారాయణ మనసు ఆనందంతో ఉప్పొంగింది. పేడ కుప్పల మధ్య వున్నా లోకేష్ వజ్రమేననుకున్నాడు. తర్వాత లోకేష్‌తో మాట్లాడి ఇండియాకు బయల్దేరాడు. హైదరాబాద్‌లో దిగడంతోటే నేరుగా చంద్రబాబు ఇంటికి వెళ్లాడు. ఆయన అప్పుడే సచివాలయానికి బయల్దేరడానికి సిద్ధంగా ఉన్నాడు. నారాయణ రాగానే చంద్రబాబు అక్కడే కూర్చున్నాడు. ఏం నారాయణ, ఏంటి సంగతులని చంద్రబాబు అడిగాడు. రాజధాని కోసం మీరెంత కష్టపడుతున్నారో, నేను అంతకంటే ఎక్కువే కష్టపడుతున్నాను. మీరు కేవలం సింగపూరే అన్నారు, నేను అమెరికాలో ఇంకొన్ని నగరాలను చూసొచ్చాను. మన రాజధానిని అలా కడదాము. కాకపోతే ఇంకో 50వేల ఎకరాల భూమి అవసరమవుతుందన్నాడు. ఆ మాట వినగానే చంద్రబాబు కోపంగా... నో... నెవర్, దీనికి నేను ఒప్పుకోను, రాజధాని పేరుతో ఒక్క ఎకరా భూమిని రైతుల నుండి తీసుకున్నా నేనొప్పుకునేది లేదు. మనకు రాజధాని లేకపోయినా ఫర్వాలేదు. గుంటూరు శివార్లలో షెడ్లు వేసుకుని పరిపాలన సాగిస్తాను, అంతేగాని మూడు కార్లు పంటలు పండే భూములను రాజధానికి వాడుకోవడమంటే నా మనసు ఒప్పుకోదు, రైతు బాగుంటేనే మనం బాగుంటాం, రాష్ట్రం బాగుంటుందని చెప్పాడు. ఈ మాటలంటున్నది చంద్రబాబేనా లేక ఆయన ప్లేస్‌లో డూప్లికేట్ ఎవరన్నా ఉన్నారా అనే అనుమానం నారాయణకు కలిగింది. అంతలో ఇరిగేషన్‌శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వచ్చి... సార్... పట్టిసీమ ప్రాజెక్టును ఎప్పుడు మొదలు పెడదామని అడిగాడు. అందుకు చంద్రబాబు... అదో దండగ ప్రాజెక్ట్, డబ్బు నీళ్లల్లో పోసినట్లే, దీనివల్ల ఒరిగేదేమీ లేదు. దీనిబదులు పోలవరం పూర్తి చేసుకుందామని చెప్పాడు. ఆ మాటతో దేవినేనికి కరెంట్ షాక్ కొట్టినట్లయ్యింది. ఏందబ్బా ఈయన ఇలా మారిపోయాడంటూ దేవినేని బుర్రగోక్కుంటూ వెళ్లిపోయాడు. ఆ తర్వాత మైనింగ్ మంత్రి పీతల సుజాత వచ్చింది. సార్, ఇసుక రీచ్‌లలో ఎద్దులబండ్ల వాళ్లు ఇసుకను తవ్వుకుని పోతున్నారు. వాళ్లమీద పీడీ కేసులు పెట్టి లోపలేద్దాం, లేదంటే ఎన్‌కౌంటర్ చేద్దామంది. దానికి చంద్రబాబు స్పందిస్తూ... ఎప్పటినుండో ఎద్దు, బండ్లను నమ్ముకుని బతుకుతున్న వాళ్లు. ఈరోజు మనం కేసులుపెట్టి వాళ్ల బ్రతుకులను నాశనం చేయడం కరెక్ట్ కాదు, వాళ్ల పట్ల మానవత్వం చూపుదామన్నాడు. ఆ మాటలు వింటున్న నారాయణకు మతిపోయినంతపనైంది. అయినా తమాయించుకున్నాడు. ఈరోజు బాస్ ఏదో డిప్రెషన్‌లో ఉన్నట్లున్నాడనుకుంటూ పీతల సుజాత అక్కడ నుండి వెళ్లిపోయింది. అంతలో వెంగాయమ్మ మహిళా మండలి సభ్యులు అక్కడకు వచ్చారు. సార్, మీరు సీఎం కాగానే రాష్ట్రంలో బెల్టుషాపులు ఎత్తేస్తామన్నారు. ఇంతవరకు ఒక్క షాపు కూడా ఎత్తేయలేదని అధ్యక్షురాలు వెంకమ్మ చెప్పింది. వెంటనే చంద్రబాబు ఎక్సైజ్‌మంత్రి కొల్లు రవీంద్రకు ఫోన్ చేశాడు. అవతల మంత్రి ఫోన్ ఎత్తగానే చంద్రబాబు... రవీంద్ర ఏం చేస్తావో, ఏమో రేపు ఉదయానికల్లా రాష్ట్రంలో ఒక్క వైన్‌షాపు కూడా ఉండడానికి వీల్లేదని చెప్పి ఫోన్ పెట్టేసాడు. ఆ మాటకు మంత్రి నారాయణతో పాటు వచ్చిన మహిళలు కూడా బిత్తరపోయారు. వెంకమ్మ వుండి... మేం ఎత్తేయమన్నది బెల్టుషాపులనే, మొత్తం వైన్‌షాపులను కాదు అని అంది. నాకు తెలుసమ్మా, వైన్‌షాపులు మాత్రం ఎందుకుండాలి, వీటివల్లే మగాళ్లు తాగి ఇళ్లు, సంసారాలు గుల్లవుతున్నాయని చంద్రబాబు అన్నాడు. అంతే ఆ క్షణంలో అక్కడున్న మహిళలకు చంద్రబాబులో ఒక గాంధీతాత, ఒక కందుకూరి వీరేశలింగం పంతులు, ఒక గురజాడ అప్పారావు కనిపించ సాగారు. చంద్రబాబుకు వాళ్లంతా చేతులు జోడించి కృతజ్ఞత చెప్పి వెళ్లిపోయారు. వాళ్లు పోగానే చిత్తూరుజిల్లా నుండి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఐజి, జిల్లా ఎస్పీ, ఇంకొంత మంది పోలీసు అధికారులు వచ్చారు. ఐజి వుండి... సార్, శేషాచలం అడవుల్లో ఎర్రచందనం కూలీలను అదుపు చేయడం కష్టంగా వుంది, తమిళనాడు నుండి ఏదో వెంకటగిరి పోలేరమ్మ జాతరకు వచ్చినట్లుగా కూలీలు మందలు మందలుగా వస్తున్నారు. కేసులతో, లాఠీలతో వీళ్లను అదుపు చేయడం కష్టం, కొంతమందిని ఎన్‌కౌంటర్‌లో లేపేద్దాం, ఆ విధంగా నన్నా భయపడి రాకుండా వుంటారన్నాడు. అప్పుడు చంద్రబాబు కోపంగా... అధికారం పోతే తెచ్చుకోవచ్చుగాని, ప్రాణం పోతే తేగలమా, ఎటువంటి ఎన్‌కౌంటర్‌లు వద్దు, శాంతియుతంగా చెప్పండి, ఎర్రచందనం కూలీలందరికీ గులాబి పూలు చేతికిచ్చి గాంధీగిరిలో నిరసన తెలపండి, మనకు గాంధీతాత రోల్‌మోడల్, స్వాతంత్ర్యం కోసం ఆయన శాంతియుతంగా ఎన్నేళ్లు పోరాటం చేయలేదు. అలాంటిది మనం శాంతియుతంగా ఎర్రచందనం కూలీలను ఆపలేమా? తూటాతో చేయలేనిది మాటతో చేయొచ్చు... వెళ్లి ఆ విధంగా ప్రయత్నించండని చెప్పాడు.

అప్పటికే జరిగినవన్నీ చూస్తున్న నారాయణకు బి.పి. ఒక్కసారిగా రేజయ్యింది. అంతా రివర్స్‌లో వుందే సరికి ఏమీ అర్థంకాక భయంతో కెవ్వ్‌వ్.... అంటూ కేకపెట్టాడు. అలా కేకపెడుతూనే మంచం మీద లేచి కూర్చున్నాడు. ఆయన కేకను విని బయటే వున్న గన్‌మెన్‌లు పరుగెత్తుకుంటూ వచ్చారు. ఏమైంది సార్ అంటూ ఆత్రంగా అడిగారు. పదిహేను నిముషాలకు గాని నారాయణ తేరుకోలేకపోయాడు. కొంచెం స్థిమిత పడ్డాక అప్పటిదాకా తనకు వచ్చింది కల అని, తాను నెల్లూరులోని తన ఇంట్లోనే వున్నానని గ్రహించి మంచినీళ్లు తాగి మళ్లీ ధైర్యంగా పడుకున్నాడు.

## కదంబం



### శిలారథం

డా॥ సి.భవానీదేవి
హైదరాబాద్. 9866847000

శత సహస్ర బాహువులు చాచి
స్వాగతించే అరుణుని పాదస్పర్శతో
పులకాంకిత సూర్యరథ విన్నాణమిది!

ఇరవైనాలుగు గంటల దినాలు చక్రాలుగా
ఎనిమిది జాములు చక్రానికి ఆకులుగా
మహాలక్ష్మీ సత్వల ఇరుసుగా
సప్తవర్ణాశ్వర రథారూఢుడు
ప్రత్యక్ష దైవ శిలారథం
సకల కళాతేజ విలసితం!

ఈ శిల్పసుందరి సౌందర్యకల్పనకు
ఏ శిల్పి యవ్వనాన్ని ధారబోశాడో!
ఈ నాగినీభృకుటీ విలాసం
ఏ కళింగరాజ దీక్షా దర్పమో!
ఈ మిథున క్రీడా భంగిమల్లో
కుదురుకున్నదే సృష్టిరహస్యమో!
ఈ నాట్యకత్తెల కాలి అందియలు
కర్ణపేయ రవళిగా రంజిల్లటం
ఎందరు రసమయ శిల్పకారుల
త్యాగనిరతీ సుకృతఫలమో!
సుప్రభాత సూర్యనేత్రానికి
సిసలైన శిల్పకారుడందించిన కళాంజలిని
కళ్ల నిండా నింపుకుందామనుకున్నాను
మనసుతీరా మాట్లాడదామనుకున్నాను
నిశ్శబ్ద సౌందర్యమే మధురం కదా!

(కోణార్క సూర్యదేవాలయం చూసి)

# వేడుకగా శ్రీనివాస కల్యాణం



కలియుగ ప్రత్యక్షదైవం ఆ తిరుమల శ్రీ వేంకటేశ్వరుని జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని టిటిడి కల్యాణమండపంలో సోమవారం వేడుకగా శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తుల గోవింద నామ స్మరణల మధ్య, మంగళవాయిద్యాలు, అర్చకుల వేదమంత్రోచ్ఛరణల మధ్య శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శ్రీనివాసుని కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు, టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, హిందూ ధర్మ ప్రచార మండలి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని ఆద్యంతం తిలకించి పులకించిపోయారు. అర్చకులు వేదగిరి ఫణిశర్మ, ధరణికోట నాగేంద్ర శర్మల ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవం సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా జరిగింది. హిందూ ధర్మప్రచార మండలి ప్రతినిధులు సివి సుబ్రహ్మణ్యం, వంజవాక ధనుంజయ, కొండా శేఖరరెడ్డి, వొమ్మిన నాగసతీష్‌బాబు ఉభయకర్తలుగా వ్యవహరించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ మల్లెల శ్రీహరి, ధర్మప్రచార మండలి సభ్యులు డాక్టర్ భానుప్రకాష్, కొండెపి గిరిజమ్మ, వీరిశెట్టి సుధాకర్, వేమిరెడ్డి సనత్‌కుమార్‌రెడ్డి, దేవరాజులు పాల్గొన్నారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా ప్రముఖ భక్తిగాయకుడు గుండాల గురవయ్య ఆలపించిన భక్తి గీతాలు, అన్నమాచార్యుల సంకీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆర్.తులసీబాయి (గాత్రం), ఆర్.శ్రీనివాసులు(హరికథ), ఎ.జనార్ధనాచారి(తబలా), పి.వేణుగోపాలకృష్ణ (హార్మోనియం) తదితరులు వాద్య సహకారం అందించారు.

# ముస్తాబైన మురళీకృష్ణ స్వీట్స్





నెల్లూరుజిల్లాలో పండుగలైనా, నూతన సంవత్సరం లాంటి వేడుకలైనా, వాటిని మురళీకృష్ణ స్వీట్స్‌తో ఎంజాయ్ చేయాల్సిందే. ఇక్కడి ప్రజల జీవితాల్లో మురళీకృష్ణ స్వీట్స్ అంతగా భాగమైపోయాయి. తమ ఖాతాదారుల సౌకర్యార్థం మద్రాసు బస్టాండ్ వద్దగల మురళీకృష్ణ స్వీట్స్ దుకాణాన్ని ఇటీవల కొన్నిరోజులు మూసివేసి, విశాలంగా, అత్యంత అధునాతనంగా అలంకరించారు. కొత్త సొగసులతో రూపుదిద్దుకున్న మురళీకృష్ణ స్వీట్స్‌ను ఈ నెల 15వ తేదీన మురళీకృష్ణ హోటల్స్ వ్యవస్థాపకులు గ్రోసు గోపాలయ్య ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మురళీకృష్ణ హోటల్స్ అధినేత వి.హజరత్‌బాబుతో పాటు పలువురు ప్రముఖులు, ఖాతాదారులు, మురళీకృష్ణ హోటల్స్ అభిమానులు పాల్గొన్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## జేసీనే ఇన్‌ఛార్జ్ కమిషనర్



నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్‌నే నియమించారు. కమిషనర్ చక్రధర్‌బాబును రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్‌కు బదిలీ చేయగా సోమవారం ఆయన రిలీవ్ అయ్యారు. ఈ తరుణంలో అదనపు కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డినే ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా నియమించాలనుకున్నారు. అయితే ఇన్‌ఛార్జ్ అయినా ఐఏఎస్ అధికారి అయితేనే బాగుంటుందనుకుని మొదట విముఖత చూపిన జేసీకే ఆ బాధ్యత అప్పగించారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com